# పుస్తక పరిచయాలు

**2010,2011**



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 64

# *కౌముది 2010, 2011 సంచికలలో పరిచయమైన పుస్తకాలు*

## *ఇందులో...*


| | | |
|---|---|---|
| 1 మనసుకు చూపుంటే | స్వాతీ శ్రీపాద కవితలు | 1 |
| 2 చిత్రలోకం | కె.బి.కృష్ణ | 2 |
| 3 సినిమా పోస్టర్ | ఈశ్వర్ | 3 |
| 4 వెన్నలో లావా | ఎమ్వీ రామిరెడ్డి కథలు | 4 |
| 5 అనగనగా ఓ నాన్న | మల్లాది వెంకట కృష్ణమూర్తి | 5 |
| 6 అద్దంలో మనం | ఎ.ఎస్.లక్ష్మి | 6 |
| 7 డేగ రెక్కల చప్పుడు | యండమూరి వీరేంద్రనాథ్ | 7 |
| 8 సరిహద్దు | సాయి బ్రహ్మానందం గొర్తి | 10 |
| 9 శ్యామ్‌యానా | మెడికో శ్యామ్ | 11 |
| 10 టేకిటీజీ | డొక్కా శ్రీనివాస ఫణికుమార్ | 12 |
| 11 స్వర్ణయుగ సంగీత దర్శకులు | పులగం చిన్నారాయణ | 13 |
| 12 క  రాజు కథలు | సింగీతం శ్రీనివాసరావు | 14 |
| 13 శ్రీకృష్ణ దేవరాయలు | కస్తూరి మురళీకృష్ణ | 15 |
| 14 దాసరి సుబ్రహ్మణ్యం పుస్తకాలు | | 16 |
| 15 మనిషి కోసం | గుత్తికొండ సుబ్బారావు | 17 |
| 16 ఆసరా | వారణాసి నాగలక్ష్మి | 18 |
| 17 నా హం కర్తా హరిః కర్తా | అత్తలూరి నాగభూషణమ్ | 19 |
| 18 అనేక | అఫ్సర్, వంశీకృష్ణ | 20 |
| 19 షిర్డి సాయి | అన్నవరపు కుమార్ | 21 |
| 20 సైన్స్ ఫిక్షన్ కథలు | కస్తూరి మురళీకృష్ణ | 22 |
| 21 శ్వమేధము | కోడూరు శ్రీ పాండురంగారావు | 23 |
| 22 ఒక పద్యం నేర్చుకుందాం | డా.జి.లక్ష్మణరావు | 24 |
| 23 ధ్యానం | పి.వి.కృష్ణారావు | 25 |
| 24 ఆ కుటుంబంతో ఒకరోజు | జె.యు.బి.వి.ప్రసాద్ | 26 |
| 25 విజయనగరం | కోరుపోలు కళావతి | 27 |

| | | | |
|---|---|---|---|
| 26 | అమెరికా ఇల్లాలి ముచ్చట్లు | శ్యామలాదేవి దశిక | 28 |
| 27 | ఇంకా ఎన్నాళ్ళిలా | పి.వి.కృష్ణారావు | 29 |
| 28 | రెండో పాత్ర | విన్నకోట రవిశంకర్ | 30 |
| 29 | ది ట్రూత్ ఎబౌట్ గీత | వి. ఆర్.నార్ల | 31 |
| 30 | వేర్ డు వియ్ బిలాంగ్? | డా.ఉమ ఎయ్యుణ్ణి | 32 |
| 31 | ఆవిష్కరణ | శ్రీదేవీ మురళీధర్ | 35 |
| 32 | అమెరికా అందాల గంధాలు | కోరుపోలు కళావతి | 36 |
| 33 | ఆల్బమ్ | గోపరాజు రాధాకృష్ణ | 37 |
| 34 | పేరడీలు-హాస్యకథలు | సూరంపూడి విశ్వం | 38 |
| 35 | టాక్స్ అండ్ ఆర్టికిల్స్ | సి.సుబ్బారావు | 39 |
| 36 | పదహారేళ్ళ పల్లవిలో | ఎన్.శివపార్వతి | 40 |
| 37 | మరువాడ రాజేశ్వరరావు కథలు | | 41 |
| 38 | సుఖమ్ ఆయు | జిగ్యాస గిరి, ప్రతిభా జైన్ | 42 |
| 39 | ది లాస్ట్ లెక్చర్ | ర్యాండీ పౌష్ | 43 |
| 40 | మహానటి సావిత్రి | వి. ఆర్.మూర్తి, వి.సోమరాజు | 44 |
| 41 | తెలుగువేదం | జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు | 45 |
| 42 | శీత సుమాలు | కె.గీత | 46 |
| 43 | వాన వెలిసిన సాయంత్రం | కన్నెగంటి చంద్ర | 47 |
| 44 | రంగుటద్దాల కిటికీ | ఎస్.నారాయణస్వామి | 48 |
| 45 | మదర్పిత..తంబూలాది | మానస | 49 |
| 46 | మువ్వలు | తుమ్మూరి రామ్మోహనరావు | 50 |
| 47 | కవితా రాగసుధ | వింజమూరి రాగసుధ | 51 |
| 48 | పడమటి కనుమల్లొ తరుణోదయం | కెనడా రచయితలు / రచయిత్రులు | 52 |
| 49 | అక్షరమాలలు పద్యతోరణములు | డా.మంగమాంబ | 53 |
| 50 | పరి పరి పరిచయలు | ఇంద్రగంటి శ్రీకాంత్‌శర్మ | 54 |

# పుస్తక పరిచయం




**సమకాలీన తెలుగు సాహితీరంగంలో** కవయిత్రిగా, కథా, నవలా రచయిత్రిగా, అనువాద రచయిత్రిగా చక్కటి పేరు తెచ్చుకున్నా స్వాతి శ్రీపాదగారి కవితల సంపుటి ఈ ‘మనసుకు చూపుంటే…‘ పుస్తకం పేరు ఎంతభావస్ఫోరకంగా ఉందో ఇందులోని కవితలన్నీ అంతే కవితాత్మకంగా ఉన్నాయి. చక్కటి, చిక్కటి, భావాలకీ, భావ వ్యక్తీకరణకి ప్రతిరూపాలు ఈ కవితలన్నీ.. ‘చూసే కనులకు మనసుంటే..ఎటు చూసినా అందమే..‘ అన్నాడొక కవి. ‘మనసుకు చూపుంటే..‘ మధ్యతరగతి మరణ శాసనాలకు / నిలువెత్తు అద్దం పట్టే / ఆధునిక హింసాచిత్రమయేది ‘, ‘‘స్వప్న బాలికలు / నిర్మించే సైకత సౌధాలు - పదాల పెదవుల కతికించాలని / ఉబలాటపడే నిట్టూర్పులూ.. చరిత్ర కరపత్రాలయేవి.‘ అంటారు మొదటి కవితలోనే కవయిత్రి. కన్నీటి రాజకుమారి చెక్కిలి మీటి పలకరించే తొలకరి స్వప్నాన్ని , ఎల్లల్ను కూడా మింగేసిన శూన్యాన్ని ‘నువ్వూ-నేను‘ లో దర్శింపచేస్తారు. వ్యక్తిగత జీవితంలోనూ, సామాజిక జీవితంలోనూ కూడా గందరగోళం, హడావిడి పెరిగిపోతున్న ఈ రోజుల్లో ‘చిటికెడు ఏకాంతం‘ కావాలి అంటూ స్వాతిగారు చిత్రించిన పద చిత్రాలు మనసుకు తాకుతాయి, మనల్ని ఆలోచింపచేస్తాయి..‘ క్షణం తీరిక లేకుండా / నిరంతరంకొనసాగే పరుగుపందెంలో / ఓటమీ లేదు - గెలుపు అంతకన్నా లేదు..‘ ఎప్పుడూ మిగిలేది సంఘర్షణే! పోనీ బయటి విషయాలన్నింటినీ వదిలేసి మనలో మనం కుంచించుకుని ఏకాంతాన్ని ఆశ్రయిద్దామంటే ‘భీకరంగా అపహసించే / అంతరాత్మ సంఘర్షణలు ‘ వెంటాడుతూనే, వేటాడుతూనే ఉంటాయి. అందుకే పిడికెడు ఏకాంతం కోసం రచయిత్రి పరితపిస్తూ ఆధునిక జీవన పోరాటాలకి చక్కటి కవితారూపం ఇచ్చారు. ‘శూన్య స్వప్నం‘, ‘చూపులవేట‘,‘ వసంత యామిని‘,‘నీ అదృశ్య బాహువుల్లో..‘,‘ఆకుపచ్చ వర్షం..‘ చాలా శీర్షికలు చదివితేనే మనసు కవితల చినుకుల్లో తడిసి ముద్దయినట్లనిపిస్తుంది. కొన్ని కొన్ని కవితల్లో విరామ చిహ్నాలు ఉంటే భావం మరింత తేలిగ్గా మనసులకి చేరేదనిపిస్తుంది.

మొత్తం మీద చూస్తే - కేవలం వచనాలే కవితలుగా, వాక్యాలని విరిచి పంక్తులుగా పేర్చడమే ఆధునిక కవిత్వంగా చెలామణి అవుతున్న రోజుల్లో స్వాతి శ్రీపాదగారి కవితలు ఎడారిలో ఒయాసిస్‌లా అనిపిస్తాయి కవితా ప్రియులకి.

* **

*Published by:*
**Smitha Publications**
**Hydearbad**

*For Copies:*
**Navodaya Book House**
**Visalandhra Book House**
**Prajashakti Book House**
**Disa Book House**




**తెలుగులో హాస్యరచనలు** తక్కువగా వస్తున్న ఈ రోజుల్లో కె.బి.కృష్ణగారి 'చిత్రలోకం' హాస్య కథల సంపుటి ఒక శుభవార్త. కృష్ణగారి హాస్య రచనా శైలి విలక్షణం. సాధారణంగా హాస్యరచనలు కొన్ని సంభాషణా ప్రధానంగా సాగితే, మరికొన్ని కొసమెరుపులతోనో, పాత్రల పేరులతోనూ, సన్నివేశాలతోనూ నవ్విస్తాయి. కె.బి.కృష్ణగారి కథలు వీటన్నింటినీ కలగలిపి ఒక్కో కథా ఒక ఫ్లోలో వెళుతుంది. ఇందులోని కథలన్నీ వివిధ పత్రికల్లో ప్రచురితమైనవే. అలానే 1985 నుంచీ వచ్చినవి కాబట్టి ఆయా కాలాన్ని బట్టి వివిధ కథా వస్తువులని స్పృశించారు. ఐదునిమిషాల కథకి అరగంట ప్రకటనలతో సాగే టి.వి.సీరియళ్ళు, రాజకీయ సమావేశాలకి ప్రజలని సరఫరా చేసే బ్రోకర్ల మాయలూ, సినిమాల్లో ఐటమ్ పాటలమీద సెటైర్లూ, ఇంటర్నెట్ కంపెనీల లీలలూ, ఆధునిక గేయరచయితల విన్యాసాలూ.. నవీనసమాజంలోని అన్ని కోణాలనీ లైటర్ వెయిన్‌లో తట్టిచూపించారు రచయిత. ప్రచురణకర్తలు ముందుమాటలో చెప్పినట్లు ' ఈ కథా సంపుటి నవ్వించే, నవ్వు పుట్టించే చక్కటి టానిక్ వంటిది. ఇందులోని ఒక్కో కథా ఒక కామెడీ పిల్ లాంటిది. మీకు 'మందహాసం' కావాలో, 'దరహాసం' కావాలో, 'వికటాట్టహాసం ' కావాలో మీకున్న కెపాసిటీని బట్టి మీకు అవసరమైన డోస్‌ని బట్టి ఇందులోని కథల్ని ఆ మేర చదువుకోండి' అన్న మాటలు నిజమేనని ఈ సంపుటి చదివిన ప్రతివారూ ఏకీభవిస్తారు.

* **

***Writer Address:***
***Lion KB Krishna***
***3-15/2 Gayatri Nilayam***
***Valasa Pakala, Kakinada – 533 005***
***Phone: 0884-2358217, 99891 02736***

***For Copies:***
**Jayanthi Publications**
**Visalandhra Book House**
**Prajashakti Book House**




***Published by:***
**Vijaya Publishers**
**15,Palayakaran Street**
**Kalaimagal Nagar**
**Ekkattuthanagal**
**Chennai – 600 032**

***Writer Contacts:***
**Eswar.kosana@gmail.com**
***044- 2434 1875, 98840 46535***

**ఈ రోజుల్లో ఐతే ఇంటర్నెట్, టి.వి, రేడియో, పత్రికలు..**ఇలా అనేక విధాలుగా సినిమాకి పబ్లిసిటీ లభిస్తోంది. ఇదే కొన్ని దశాబ్దాల క్రిందట ఐతే సినిమా పబ్లిసిటీలో ప్రముఖపాత్ర వహించినవి పత్రికలు, వాల్ పోస్టర్లు మాత్రమే.! ఆ రోజుల్లో ప్రేక్షకులని సినిమాహాళ్ళకి రప్పించడంలో వాల్ పోస్టర్ల పాత్రకీలకంగా ఉండేది. కంప్యూటర్లూ, ఫోటోషాప్ లాంటి సౌకర్యాలు లేని రోజుల్లో ఈ వాల్ పోస్టర్ల రూపకల్పనలోనూ, భారీ సైజు హోర్డింగ్స్ తయారు చేయడంలోనూ చేయితిరిగిన చిత్రకారులు మాత్రమే విజయవంతంగా కొనసాగుతుండేవారు. ఆ తరం సినీ పబ్లిసిటీ కళాకారుల్లో ప్రముఖులు శ్రీ ఈశ్వర్‌గారు. ఈశ్వర్ గారు కుంచెపట్టుకుని వెయ్యని ఏ భారతీయ కథానాయకుడి చిత్రం లేదు. ఆయన పనిచెయ్యని ఏ పెద్ద సంస్థ లేదు. ఆయనతో పోస్టర్ చేయించుకోని ఏ దర్శకుడూ లేడు. అటువంటి అరుదైన ప్రముఖ చిత్రకారుడు ఈశ్వర్‌గారి కలం నుంచి వెలువడిన సమగ్ర సమాచార దర్శిని ఈ సినిమా పోస్టర్ పుస్తకం. ఈ పుస్తకంలో ఈశ్వర్‌గారి జీవన చిత్రణతో పాటు ఇంకా అనేక విలువైన విశేషాలున్నాయి. ఈశ్వర్‌గారు పనిచేసిన దర్శకుల, సినిమాల గురించిన ఆసక్తికరమైన సమాచారం ఉంది. తెలుగుదేశాన్ని తమ చిత్రకళావైభవంతో తేజోమయం చేసిన చిత్రకారుల పరిచయాలు, మిగతా సినిమా పబ్లిసిటీ ఆర్టిస్టుల వివరాలు, సినిమా పబ్లిసిటీ కంపెనీల విశేషాలు. అన్నీ అపురూపమైనవే. ఇలాంటి వివరాలు కేవలం ఈశ్వర్‌గారు మాత్రమే వ్రాయగలరు. అన్ని విశేషాలూ ఒక ఎత్తు ఐతే ఈశ్వర్‌గారు చిత్రించిన సినిమా పోస్టర్లు, పత్రికా పబ్లిసిటీ ఆర్టు వర్క్స్, ప్రముఖ తారల వర్ణచిత్రాలూ ఇంకొక ఎత్తు. వెరసి ఈశ్వర్‌గారు ఈ పుస్తకాన్ని కేవలం తన స్వీయచరిత్రకే పరిమితం చేయకుండా సినీ పబ్లిసిటీ రంగాన్ని వివిధ కోణాల్లో విశ్లేషించిన తీరు ప్రశంసనీయం. 2,500 సినిమాలకి పనిచేసి రికార్డు నెలకొల్పిన ఈశ్వర్‌గారి గుండె లోతుల్లోంచి, కలెక్టర్స్ ఎడిషన్‌లా, వెలువడిన ఈ పుస్తకం తెలుగు చలనచిత్ర చరిత్రలో తనకంటూ ఒక స్థానాన్ని పదిలపరచుకుంటుంది.

* **




***Published by***
**Muvva Cinabapireddy Memorial Trust**
**PEDAPARIMI – 522 236, Guntur Dt.**
***For Copies:***
**Navodaya Publishers**
**Visalandhra Book House**
**Prajashakti Book House**

**సాహిత్యం సామాజిక ప్రయోజనం కోసమేనని నమ్మి,** మనసా వాచా కర్మణా ఆ భావాన్ని అమలు పరుస్తున్న విలక్షణ రచయిత ఎమ్వీ రామిరెడ్డిగారు. రామిరెడ్డిగారు కేవలం రచయిత  మాత్రమే కాదు, నిబద్ధత, అంకిత భావం కలిగిన సామాజిక సేవా కార్యకర్త. ముందు మాటలో ఆయనే చెప్పుకున్నట్లు ఆయన సాహిత్యాన్నీ, సేవాభావాన్ని విడివిడిగా చూడడంలేదు. ఒక ట్రస్టుని స్థాపించి తన సంపాదనలోంచి అత్యధికభాగాన్ని ఆ ట్రస్టు సేవా కార్యక్రమాలకి వినియోగిస్తూ గత పుష్కర కాలంగా అనేక ప్రజోపయోగ కార్యక్రమాలు, ముఖ్యంగా అర్హులైన బీద విద్యార్థినీ, విద్యార్థులకు చదువుల కోసం అయ్యే ఖర్చుని భరిస్తున్నారు. అనేకమంది భవిష్యత్తుకి బంగారు బాటలు వేస్తున్నారు. ఇంత ఆచరణాత్మక ఆశయాలున్న రచయిత కాబట్టే ఈయన కథలన్నీ సమకాలీన సమస్యలని విశ్లేషిస్తూ, అనువైన పరిష్కారాలని కూడా చర్చించే మార్గంలో సాగుతాయి. అందుకే ఇవన్నీ మనలోంచి వచ్చిన మన కథలు. మనల్ని ఆలోచింపచేసే మన సమాజం కథలు.

‘నా మొహం చూస్తే ‘ కథలో ఆధునిక జీవన శైలిలోని ఒక సాలెగూటిలో చిక్కుకుని  ఆత్మహత్య శరణ్యమనుకున్న తనూజ లాంటి మోడర్న్ యువతులకి అసలైన కర్తవ్యాన్ని గుర్తుచేస్తారు రచయిత. ‘క్రిమి సంహారం‘ కథ సాంకేతికరంగ పురోగమన వెల్లువలో కొట్టుకుపోతున్న యువజీవితాలని ఒక్కసారి పల్లెటూరి పొలం గట్ల వెంబడి నడిపించి, ఆక్కడ రైతులు పంటరక్షణ కోసం సాగిస్తున్న క్షణ క్షణ ప్రమాదభరితమైన జీవితాలని టార్చ్ లైట్ వేసి చూపిస్తుంది. కార్పొరేట్ వ్యాపారంగా మారిన రెసిడెన్షియల్ కాలేజీల్లోని విద్యార్థినీ విద్యార్థుల డిప్రెసివ్ జీవితాలు, ఆయా వార్తలని ప్రసారం చేసే ప్రసారమాధ్యమాల తప్పొప్పుల్ని కొత్తకోణంలో చూపించే కథ మేధావిధ్వంసం. ప్రతి కథా సమకాలీన సమాజంలోని ఏదో ఒక సమస్యని ఆలోచనాత్మకంగా విశ్లేషిస్తూ, కథా సాహిత్యాన్ని నూటికి నూరుశాతం ప్రయోజనాత్మకంగా ఎలా తీర్చిదిద్దవచ్చో నిరూపిస్తుంది. రచయిత ఎమ్వీ రామిరెడ్డిగారి కథల్లోని నిజాయితీకి పాఠకులంతా అభినందనలు తెలియచేయాలి.

* **




**ఆంధ్రుల ఆహ్లాద రచయిత** మల్లాది వెంకట కృష్ణమూర్తిగారి కలం నుండి వెలువడ్డ తాజా నవల 'అనగనగా ఓ నాన్న'. గాంధీ హాస్పిటల్‌లో సర్జన్‌గా పనిచేసే పెళ్ళికాని యువడాక్టర్.. తనతల్లికి తానే పోస్ట్‌మార్టమ్ చెయ్యాల్సి రావడం ఒక విచిత్రమైతే, ఆ పోస్ట్‌మార్టమ్‌లో ఆమెకి గర్భాశయమే లేదని తేలడం ఇంకో విచిత్రం. అంటే ఆమె తనకి తల్లికాదు. రహస్యం చెప్పగలడనుకున్న తండ్రికాని తండ్రికి అల్జైమీర్స్ వ్యాధి. గతం గుర్తులేని పరిస్థితి. బంధువులెవ్వరికీ ఏమీ తెలీదు. అక్కడ మొదలైంది డా.త్రివిక్రమ్ ప్రయాణం..కన్నతండ్రి కోసం అన్వేషణ! ఈ విచిత్ర ప్రయాణంలో ఎన్నోమలుపులు, ఎన్నో అనుభవాలు,ఎంతో మంది వ్యక్తులు, అనుకోని సన్నివేశాలు, ఊహించని సందర్భాలు... నవల మొదలుపెడితే పూర్తయేవరకూ వదలనివ్వని సస్పెన్స్. సహజసిద్ధమైన మల్లాదిగారి శైలి పాఠకుడిని ఎక్కడా టీజ్ చెయ్యకుండా చెయ్యి పట్టి తనతో నడిపించుకుంటూ వెళుతుంది. అది కర్నూలు కానీ, రేపల్లె కానీ, యానాం కానీ..త్రివిక్రమ్‌తో పాటు మనమూ ప్రయాణిస్తాం. మల్లాదిగారి రచనల్లో మరో టెక్నిక్ - ఎక్కువ వర్ణనలు లేకుండానే సన్నివేశ నేపథ్యాన్ని పాఠకుల కళ్ళముందు నిలబెట్టగలగడం. మధ్యమధ్యలో కథా గమనానికి అడ్డు పడకుండా కథలో అందంగా ఇమిడిపోయే టిట్ బిట్స్, ఆసక్తికరమైన విశేషాలు, హెల్త్ టిప్స్, సరదా ప్రశ్నలు ఉత్ప్రేరకాలుగా పనిచేస్తాయి. నలభై రెండు సంవత్సరాలు పైగా వ్రాస్తున్నా తన రచనల్లో వాడి,వేగం ఏ మాత్రం తగ్గలేదని ఈ నవలతో మరోసారి నిరూపించారు మల్లాదిగారు. కథా వేగం పెంచేందుకు , ఇంటర్నెట్ యుగంలోని యువతరం అలవాట్లని అత్యంత ప్రతిభావంతంగా ఉపయోగించుకున్నారు. మధ్య మధ్యలో మనసుని సున్నితంగా తాకే వాక్యాలు వ్రాసి మల్లాది గారు తమ ప్రత్యేకతని నిలబెట్టుకున్నారు. ఆహ్లాదానికి నిజమైన నిర్వచనం తెలుసుకోవాలంటే ఈ నవల చదవమని ఎవరికైనా ధైర్యంగా రెకమెండ్ చెయ్యవచ్చు.

**Published by:**
**Lipi Publications**
**1-1-728/A Gandhi Nagar**
**Hyderabad – 500 080**
**telugubooks@yahoo.com**
**Phone: 040-2761 2244**
**Cell: 98490 22344**

* **




*Published by*
**Madhurima Publications**
**1-24-63 Venkatapuram Colony**
**Trimalgiri Post, Secunderabad**
**Phone: 040-27802346**
**eBook :@kinige.com**

**తెలుగు సాహిత్యంలో** 'కాలమ్' ప్రక్రియకున్న గుర్తింపు ప్రత్యేకమైనది. 'కాలమ్' వ్రాయడం ఒక ప్రత్యేకమైన కళ. అందునా వారం, వారం సమకాలీన సమస్యల మీద క్రమం తప్పని శీర్షికలా వ్యాసాలు, విశ్లేషణలు వ్రాయాలంటే ఎంతో నేర్పు కావాలి. పరిమితమైన పేరాల్లో వాస్తవమూ చెప్పాలి, విశ్లేషణా చెయ్యాలి, కొసమెరుపూ ఉండాలి. సీరియల్సూ, కథలూ, కవితలూ వచ్చే పత్రికల్లో ఇలాంటి కాలమ్ నడుపుతూ పాఠకుల్ని వారం , వారం ఆకట్టుకోవాలంటే శీర్షికా నిర్వాహకులకి ఎంతో నేర్పు కావాలి, పాఠకుల నాడి పట్టుకునే ఒడుపు తెలియాలి. వీటన్నింటినీ సమపాళ్ళలో సమర్థవంతంగా రంగరించే నేర్పు ఉండబట్టే ఎ.ఎస్.లక్ష్మిగారు 'అద్దంలో మనం' అనే వీక్లీ కాలమ్‌ని ఆంధ్రభూమి వారపత్రికలో గత పుష్కరకాలంగా విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఆ పరంపరలో వచ్చిన వ్యాసాలతో కూర్చిన సంపుటాల్లో ఇది మూడవది. ఇన్ని వారాలు నిరాటంకంగా ఈ శీర్షిక నడుస్తుందంటేనే దీని కున్న ప్రజాదరణని అర్థం చేసుకోవచ్చు. కాలమ్‌గా వచ్చే వ్యాసాలని సంపుటాలుగా తీసుకురావడంలో ఒక ఇబ్బంది కూడా ఉంది. కొన్ని ఆయా సమయాల్లో వేడి వేడి అంశాలు, వార్తలే ఐనా కొంతకాలానికి అవి పాతవిగా అనిపిస్తాయి. సమకాలీనత సార్వజనీనత కావడం చాలా అరుదుగా జరుగుతుంది. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ రచయిత్రి ముందుమాటలో ' పాతవే ఐనా కానీ ఇప్పటికీ - ఔను కదా - అనిపించేవే ఇందులో చేర్చాను' అని చెప్పారు. శీర్షిక పేరుతోనే ఆకట్టుకోవడం కూడా ఈ కాలమ్స్ ప్రత్యేకత ఉదా: వ్యక్తిగా..శక్తిగా!, ఒసమా సురవధ, కుడి ఎడమల నిఘా నిఘా, ఛేంజ్ కోసం ఎక్స్ఛేంజ్ మొదలైనవి. ప్రతి శీర్షికా ఎత్తుగడ కూడా లైటర్ వెయిన్‌లో ఉండి చదవడానికి మంచి మార్గం వేస్తుంది. ప్రతి కాలమ్‌కి తోడుగా వేసిన కార్టూన్లు ఈ పుస్తకానికి అదనపు ఆకర్షణ. రచయిత్రి ఎ.ఎస్. లక్ష్మిగారు అభినందనీయులు.

* **




**Published by:**
**Navasahiti Book House**
**Eluru Road, Vijayawada-520 002**

**For Copies: www.yandamoori.com**

**వీరేంద్రనాథ్‌గారు గొప్పరచయిత అని ఇప్పుడు కొత్తగా కితాబు ఇవ్వాల్సిన అవసరంలేదు.** దాదాపు 35 సంవత్సరాల క్రిందట తెలుగు నవలాసాహిత్యాన్ని ఒక మరపురాని మలుపు తిప్పిన వీరేంద్రనాథ్‌గారు, 50 పైగా నవలలు వ్రాశాక కూడా ఏమాత్రం పదును తగ్గని రచనా కౌశలంతో ఇటీవలే వ్రాసిన నవల ‘డేగరెక్కల చప్పుడు ‘. తప్పని సరిగా ఆధునిక నవలా సాహిత్యంలో ఈ పుస్తకం తనదైన స్థానాన్ని చిరస్థాయిగా నిలబెట్టుకుంటుంది.

వర్తమానంలో దాదాపు ప్రపంచదేశాలానన్నింటినీ గడగడలాడిస్తున్న అంతర్జాతీయ ఉగ్రవాదం ఈ నవలా నేపథ్యం. దాని ప్రభావం ఎక్కడో ఒకచోట దారుణ మారణకాండ రూపంలో బయటపడేవరకూ ఉగ్రవాదపు డేగ రెక్కల చప్పుడు ఎవరికీ వినిపించదు. ఆ ముతాల చీకటి కోణాలను పాఠకుల ముందుకి తీసుకురావడంలో వీరేంద్రనాథ్‌గారి కలం డేగకన్నులా పనిచేసింది. వాస్తవాన్ని, కాల్పనికతనీ సరైన పాళ్ళలో మేళవించి, యదార్థ సంఘటనలకి ఊహాజనిత సన్నివేశాలని జతకలిపి తయారు చేసిన అద్భుతమైన టానిక్ ఈ నవల. తెలుగు సాహిత్యంలో ఇలాంటి ప్రయోగాలు చేసిన రచయితలు చాలా అరుదుగా కనిపిస్తారు. పైగా ఈ నవల సీరియల్‌గా వెలువడింది కాబట్టి, ప్రతి అధ్యాయం ముగింపూ గుక్కతిప్పుకోనివ్వని సస్పెన్స్ తో ఆగుతుంది. తరువాతి అధ్యాయానికి పరుగులు తీయకుండా నిలబడడం ఏ పాఠకుడికీ సాధ్యపడదు. ప్రతి సన్నివేశంలోనూ ఊపిరి సలపని ఉత్కంఠత! ఎక్కడా ఏమాత్రం పాఠకుడి ఊహకందని మలుపులు.. అంత ఆత్రంగా వాక్యాల వెంట చూపులు పరుగెడుతుంటే - మధ్య మధ్యలో ఒక్కసారి భుజం పట్టి ఆలోచింపచేసే వాక్యాలు; ఇది కేవలం కాలక్షేపం నవలమాత్రమే కాదు, మనసులకి హత్తుకునే నవలకూడా అని ఋజువుచేస్తాయి. ఇంత సీరియస్ కథాంశంలో సున్నితమైన భావాలు, మానసిక సంబంధాలు, భావుకత, కవితాస్ఫూర్తి..ఇమడ గలవా? అవునని నిరూపించి, ఒప్పించగలగడం.. ఒక వీరేంద్రనాథ్ గారికి మాత్రమే తెలిసిన ఇంద్రజాల విద్య ! మధ్యమధ్యలో వచ్చే నడుస్తున్న చరిత్ర గురించిన వివరాలు విసుగు కలిగిస్తాయేమోనని ముందు మాటలో రచయిత సందేహాన్ని వెలిబుచ్చారు, కానీ కథలోకి వెళ్ళిన పాఠకుడికి ఏమాత్రం ఆదొక లోపంగా కనిపించదు సరికదా, కొత్త విషయాలను తెలుసుకున్న అనుభూతి మిగులుతుంది. భారతదేశం, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, సొమాలియా.. రచయిత తన పాత్రలని ఎక్కడికి తీసుకెళ్ళినా పాఠకుడూ వాళ్ళతో ప్రయాణించడం ఈ నవలా రచనలోని ప్రత్యేకత. ఇన్నీ చెప్పే కావాలనే కథని క్లుప్తంగానైనా పరిచయం చెయ్యడం లేదు..ఎందుకంటే అనుక్షణం మలుపులు తిరుగుతూ సాగే కథని - రెండు మూడు వాక్యాల్లో ‘కట్టె, కొట్టె, తెచ్చె‘ అన్నట్లు వ్రాసి - చదవడంలో వచ్చే అనుభవాన్ని పలచనచేయడం ఈ పుస్తక పరిచయం ఉద్దేశం కాదు కనుక. విడుదలైన 15 రోజుల్లోనే మూడు వేల కాపీలు అమ్ముడవడం..ఈ పుస్తకానికున్న దమ్ముకి ఒక చిన్న ఉదాహరణ.! సస్పెన్స్ కావాలంటే, ఆధునిక ఉగ్రవాద చరిత్ర తెలుసుకోవాలంటే, వీటన్నింటి మధ్యా సున్నితమైన భావుకతా చిరుజల్లుల్లో తడుస్తూ, కవితల వానవిల్లుని చూస్తూ పరవశించాలంటే .. తప్పకచదవండి.. ‘డేగరెక్కల చప్పుడు‘ ! ***

# డేగరెక్కల చప్పుడు - నుంచి కొన్ని మంచి వాక్యాలు

**పారేసుకున్న నీ జ్ఞాపకం** ..పిండారబోసిన వెన్నెల్లో..గోదారి తరగలా వచ్చింది. చిరునవ్వుకే దిగులు నేర్పింది. ఒక కోయిల పాటకీ, తిరిగి పాడే పాటకీ మధ్యనున్న దూరం ఒక వసంతం. ఒక్క నా నవ్వుకీ ఒక్క నా దిగులుకీ మధ్యనున్న దూరం నీ స్నేహం

***

**ఇండ్లుండవు మిద్దెలతో**

కొండ్లగల రాలు పేర్చి కూర్చుటె తక్కన్
ముండ్లుండును పొలములలో
కండ్లారం జూడ 'నేరు' కన్నుల పుట్టున్
ప్రాణమన్నచో నొక గడ్డి పరక కాగ
గడ్డి పరకకై ప్రాణము లొడ్డి రచట... -

(రాయలసీమ గురించి వీరేంద్రనాథ్‌గారి నాన్నగారు వ్రాసిన పద్యాలు)

***

**ఒక తల్లి ఐదేళ్ళ కొడుకుతో**

" చూడు బాబూ! ఎవరో మనకేదో చేస్తారని ఆశించకు. జాలి కూడా వారి స్వార్థమే. మరొకరి ఆత్మ సంతృప్తులు మనకి వద్దు. 'కష్టపడి పని చెయ్యి' అనను. పనిచేయడంలో ఆనందం ఎందులోనూ లేదు. చేస్తున్న పనిని ఇష్టపడితే చాలు. నీవు పనిచేస్తున్నది 'నీ కోసం' లేదా 'నీవాళ్ళకు చేస్తున్నానన్న ఆనందం కోసం ' అని ఆలోచిస్తే అంతా ఆనందమే!"

***

**ఎక్కడి వాక్యమో మరోసారి -** 'చీకటిగా ఉన్నదని ఆఖరి మెట్టు దగ్గరే ఆగిపోతే, జీవితం మొత్తం చీకట్లోనే ఉండిపోతావు. అడుగు ముందుకు వెయ్యి. కింద ఇంకో మెట్టు తగలవచ్చు,లేదా గాలిలో ఎగరడం నీకు తెలియరావొచ్చు

***

**'ఒంటరిగా' ఉంటూ** ఆనందాన్ని ఆస్వాదించడం వేరు. వేరొక వ్యక్తితో 'ఒకే ఇంట్లో ఉంటూ ఒంటరిగా ఉండగలగడం వేరు. అది అసాధ్యం. ఒకరికొకరు నచ్చని వ్యక్తులైతే అది నరకం కూడా.

***

**నీ సంసార జీవితం సుఖంగా కొనసాగాలంటే** రెండు విషయాలు గుర్తుంచుకో! తప్పు నీదైనప్పుడు - ఒప్పుకో. నీవు కరెక్టయినప్పుడు - నోర్మూసుకో.

***

**ప్రమాదం మనిషికి అనుభవాన్ని నేర్పుతుంది.** ఆ అనుభవ స్థాయి అతని అదృష్టంపై ఆధారపడి ఉంటుంది. స్కూటర్ నడిపే కొత్తలో కాలుకి తగిలితే అదృష్టం, మొదట్లోనే అదృష్టం వస్తుంది! తలకి తగిలితే దురదృష్టం. ప్రారంభంలోనే ప్రాణం పోతుంది..!

***

**కొండలపైన పశ్చిమం** నీడలు దిగులుగా పరుచుకుంటున్నాయి. వర్షం లేక భూమీ, వాస్తవం దెబ్బలకి మనసూ పగుళ్ళు. ఆకలి జిగురై కడుపుని వీపుకి అంటించేస్తే, సరళ రేఖయిన ఒళ్ళు. ఎప్పుడో తడారిపోయిన కళ్ళు.

***

**నడుస్తూ వెనక్కి చూసి,** మంచి గతమిచ్చినందుకు భగవంతుడికి చెప్పే కృతజ్ఞత భక్తి. ముందుకి నడుస్తూ మంచి భవిష్యత్తు కోసం అతనిపై పెట్టుకున్న నమ్మకం భక్తి. వర్తమానంలో మన లోపలికి మనం తొంగిచూస్తూ అతడిని దర్శించడం భక్తి.

***

**దారి అనేది** కేవలం నడవడం ద్వారానే ఏర్పడుతుంది తప్ప ఎదురుచూడడం వల్ల తయారవదని తెలుసుకోలేం.

***

**ఎంతటి పెద్ద వాక్యాన్నయినా** చిన్న చుక్క ఆపు చేస్తుంది. మరో

కొత్త వాక్యానికి ప్రారంభం పలికించడం కోసం.

***

**వినే వాడుంటే** తన అభిప్రాయాలు అవతలి వారికి, చెప్పాలనే కోరిక ప్రతి మనిషికీ ఉంటుంది.

***

**ఒక పనిచేస్తూ,** ఎందుకు చేస్తున్నానా అని విషాదం. చేయక ఎందుకు చేయలేదా అన్న విషాదం. ఒక వస్తువు లేకపోతే విషాదం. కొన్నాక మరొకటి బావుందేమో అన్న విషాదం. నిరంతర సందిగ్ధాల వలన వచ్చిన సంఘర్షణ ఫలితమే విషాదం.

***

**భక్తులందరూ పాపులు కారు.** కానీ పాపులందరూ భక్తులే. అవినీతి పరులు తమ పాప పంకిలం కడుక్కోడానికి 'దైవ దర్శనం' డెట్టాల్. అభద్రతా భావం పెరిగే కొద్దీ భక్తి ఎక్కువౌతుంది. అందుకే చిన్నపిల్లలు, యువత చాలా వరకు స్వాముల్నీ, బాబాల్నీ నమ్మరు

***

**భక్తి అంటే** భవంతుడి పట్ల కృతజ్ఞతా భావంతో వచ్చిన తాదాత్మ్యత. అది రెండు రకాలు. నిర్మలమైన జీవితం ఇచ్చి కోరికలు తీరుస్తున్నందుకు కావొచ్చు. చేస్తున్న వెధవ పనులు చూసీ చూడకుండా వదిలేస్తున్నందుకు కావొచ్చు.

***

**జీవితం కాలువలాంటిది.** భగవంతుడిని నమ్ముకుంటే ఆయన పడవ ఏర్పాటు చేస్తాడు. నిన్ను నువ్వే నమ్ముకుంటే ఈదుకుంటూ వెళ్ళవచ్చు. ప్రతిసారీ పడవ కోసం ఎదురు చూడకుండా ఉండటం కోసమే కదా, ఆయన నీకు ఈత నేర్పాడు.

***

**భగవంతుడి ప్రార్థనలో** నీకు శాంతి లభిస్తుందే తప్ప పరిష్కారం కాదు. ప్రార్థన వల్ల వచ్చిన ప్రశాంతతతో పరిష్కారం వెదుక్కోవాల్సిన బాధ్యత నీదే.!

***

**ఓ భగవంతుడా!** కన్ను విప్పితే నువ్వు. నన్ను విప్పినా నువ్వే. నిన్ను చూడటానికి గుడి ఎందుకు? మొక్కు లంచమెందుకు?

***

**దేశభక్తి అంటారు**. దేశప్రేమ అనరెందుకో!?

***

**నమ్మకం గొప్పదే** కానీ జీవితం కన్నా గొప్పది కాదు..!

***

**అనుకోని పరిస్థితులు** చుట్టుముట్టినప్పుడు మనిషి ఆలోచించే జ్ఞానాన్ని కోల్పోతాడు. దీనికి ఎవరూ అతీతులు కారు.

***

**యుద్ధాన్ని గెలవటం గొప్పకాదు.** యుద్ధం లేకుండా శత్రువుని గెలవటం గొప్ప! శత్రువు బలహీనంగా ఉంటే అహాన్ని రెచ్చగొట్టు. అయోమయంలో ఉంటే ఎరచూపి ఉచ్చులోకి లాగు.!

***

**జీవితంలో ప్రేమలు** కేవలం 'కామా' లంటారు అనుభవజ్ఞులు. ఒకరికి ప్రేమ కామా అయి, మరొకరికి ఫుల్ స్టాప్ ఐతేనే కష్టం. ఏమీ లేకుండా వచ్చి ఏమీ తీసుకెళ్ళకుండా వెళ్ళటమే జీవితం. ఏదో ఉందని భ్రమించి ఏమీ లేదని తెలుసుకోవడమే ప్రేమ. ఈ సత్యం తెలుసుకుంటే విషాదం ఏముంటుంది? సంసార ప్రవాహంలో , గత స్నేహపు పిల్ల కాలువలు కొట్టుకు పోవటమేగా ప్రేమ.!

***

**ఎవర్నో ప్రేమిస్తావు.** మరెవర్నో పెళ్ళి చేసుకుంటావు. ఒకరు నీ భాగస్వామి అవుతారు. మరొకరు నీ మెయిల్‌కు పాస్‌వర్డ్ అవుతారు. అంతేగా ప్రేమంటే! 'నా కన్నీళ్ళతో అడుసుతొక్కి నిర్మించెద వేరొక తాజ్ మహల్' అన్నదెవరు?

***




**ప్రవాసాంధ్ర రచయితల్లో తనదైన శైలితో, కథాంశాలతో, విలక్షణమైన మార్గంలో సాగుతున్న రచయిత శ్రీ సాయిబ్రహ్మానందం గొర్తి.** ఇంటర్నెట్ పత్రికల్లోనే కాక ఆంధ్రదేశంనుంచీ వెలువడే అన్ని ప్రధాన పత్రికల్లోనూ వీరి రచనలు తరచూ ప్రచురించబడడం వల్ల వీరి పేరు తెలుగు పాఠకులకి సుపరిచితమే. అతి సరళమైన వాక్యనిర్మాణం, అతి తేలికగా సాగిపోయే శైలి వల్ల పాఠకుడిని ఏమాత్రం టీజ్ చెయ్యకుండా కథలని నడిపించడంలో నేర్పరి ఈ రచయిత. అందుకే వీరి కథల్లో రీడబిలిటీ బావుంటుంది. ఈ ముఖ్యలక్షణమే కథ చదవడం మొదలు పెట్టాక చివరి వరకూ చదివింపచేస్తుంది. కథాంశాల విషయంలో కూడా – అమెరికా జీవన విధానాలని, అక్కడి జీవన శైలుల్లోని వైవిధ్యభరితమైన కోణాలని పూర్తి స్థాయిలో ప్రతిబింబించిన కథల్లో, సాయి బ్రహ్మానందంగారి రచనలు మొదటి వరుసలో నిలుస్తాయనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఈ పుస్తకానికి మకుటంగా ఎంచుకున్న ‘సరిహద్దు‘ శీర్షికతో వ్రాసిన కథ అమెరికాకి వలస వచ్చిన మెక్సికన్ల జీవితాలకి అద్దం పడుతుంది. వాళ్ళ జీవితాల్లో చాలామందికి తెలియని మజిలీలలని చక్కటి కథాంశంగా మలిచారు. అలానే ‘అంటే ఏమిటి?‘,‘విలువలు‘,‘ఉగాడి శుభాకాంక్షలు‘ లాంటి కథల్లో కనిపించే అమెరికా జీవన చిత్రాలు, తరచూ వచ్చే డయస్పోరా కథలకి భిన్నంగా ఉన్నాయి. ‘నేను అహల్యను కాను‘ లాంటి కథాంశాలు ఈ కాలంలో ఎక్కువగా కనిపించడం లేదు. దూరపుకొండలకై ఎగబడే మనుషుల గురించిన కథ ‘వానప్రస్థం‘ కూడా ఆలోచింపచేస్తుంది. ‘సైన్యం‘ వినూత్నమైన, విజయవంతమైన ప్రయోగం. ‘బహుమతులు‘ కథా చర్చ రూపంలో సాగుతున్నట్లు అనిపించినా చక్కటి ముగింపుని ఇచ్చి, రచయిత తన ప్రతిభని నిరూపించుకున్నారు. సాయిబ్రహ్మానందం గారి కథలన్నీ చదివాక అనిపిస్తుంది – ఇవి ఉబుసుపోక వ్రాసిన కథలు కాదు. ఒక ఆలోచనతో, సమస్యలని కొత్తకోణంలో చూపిస్తూ, పాఠకుడిని ఇబ్బంది పెట్టకుండా చివరికంటా చదివించి ఆలోచింపచేయాలనే ప్రయత్నం. ఒక లక్ష్యంతో సాగిన ఈ కథా సంపుటిని అందంగా వెలువరించిన రచయిత అభినందనీయులు.

* **

***Published by***
**Bhashantara**
**AG-2, ‘A’ Block,**
**Mathrusri Apts, Hyderguda**
**HYDERABAD – 500 029**
***Writer’s Contact***
**Phone: 408-829-1925**
**gorthib@yahoo.com**




**'ముందు - గాలి థ్రస్ట్ వల్ల నడిచాను** - తరువాత నడవాలని నడిచాను - ఆగి గతం తలచాను. ఔను! - ఇంతకీ నేనెలా నడిచాను?- అసలు నడిచానా?' అని తనని తాను ప్రశ్నించుకున్నారు రచయిత మెడికో శ్యామ్ గారు. 1970-80లలో కథకుడిగా ఆయన ప్రయాణం విభిన్నమైనది, వినూత్నమైనది. ఈ సంపుటిలోని కథలన్నీ దాదాపు 30 ఏళ్ళ క్రిందట శ్యామ్ గారు వ్రాసినవి. కథలన్నింటిలోనూ కొట్టొచ్చినట్లు కనిపించేది రచనా శైలి. విలక్షణంగా సాగే శైలిలో పాఠకుడికి కవిత్వం దొరుకుతుంది, జ్ఞాపకాలు తడుముతాయి, అంతర్గత మనోసీమల్లో చెలరేగే తుఫానులు,మంచువానలూ అక్షరరూపంలో దర్శనమిస్తాయి. సందర్భానుసారం కొన్నిచోట్ల అలనాటి మరపురాని హిందీ గీతాలూ స్వరాలు వినిపిస్తాయి. చాలా మంది కథకుల లాగా 'అప్పుడే తెల్లారింది. గోపాలరావు బద్ధకంగా ముసుగుతీసి, నిద్రమంచం మీదనుంచి లేచాడు..' లాంటి ప్రారంభవాక్యాలు, కొన్ని సన్నివేశాలు, ఓ ముగింపు - ఇలా సాగేవి కావు ఈ కథలు. కొన్ని గల్పికలలా అనిపిస్తాయి. మరికొన్ని ఆలోచనా స్రవంతిలా కనిపిస్తాయి. ఏ రూపంలో ఉన్నా - ఆలోచనా, విలక్షణ ధోరణిలో సాగే విశ్లేషణా ఈ కథల ప్రత్యేకత. 'కథకుడి కథ' లాంటి కథల్లో వ్యంగ్యాత్మక చెణుకులు ఎదురౌతాయి. 'నత్తివాడి కథ' లాంటి కథల్లో మనసుని తట్టి లేపే సున్నితమైన భావాలు ఎదురౌతాయి. 'సన్నాయి పాట',' సరాగమాల', 'ముక్కుపుడక' లాంటి కథలలోని అనుకోని ముగింపు మళ్ళీ ఒకసారి వెనక్కి తిరిగి చదివేలా చేస్తుంది. 'ఏమయినా జీవితం విచిత్రమైన, తప్పొప్పుల సరాగమాల. తప్పులూ, ఒప్పులూ కూడా రాగయుక్తంగానే వాయించబడతాయి. ఒకప్పుడు శ్రు(గ)తి తప్పిన వాద్యగాడు కూడా సరాగాలే చిలికించడం విచిత్రమైన వరం ఆ వాద్యగాడి జీవితానికి' లాంటి వాక్యాలు చిరకాలం గుర్తుండి పోతాయి. శ్యామ్‌గారు తన రచనా వ్యాసంగాన్ని కొనసాగించి ఉంటే తెలుగు పాఠకులకి మరెన్నో మంచి కథా ముత్యాలు లభించి ఉండేవి. విలక్షణమైన శైలిలో, కవితాత్మకమైన ..కథలని చదివి ఆనందించే పాఠకులకి ఈ 'శ్యామ్ యానా' విందుభోజనం లాంటిది. రచయిత శ్యామ్‌గారికి అభినందనలు.

* **

**Published by:**

**Vanguri Foundation of America**
**PO Box 1948**
**Stafford, TX – 77497 USA**
**vangurifoundation@yahoo.com**




***Published by***
**Navodaya Publishers**
**Vijayawada – 520 002**
***Writer Address***
**Srini Dokka**
**535, Bellemont Court**
**Duluth, GA – 30097 USA**
**phanidokka@yahoo.com**

**ఫేస్ ఈజ్ ది ఇండెక్స్ ఆఫ్ థి మైండ్** అన్నట్లు పుస్తకం ముఖచిత్రం చూడగానే లోపల ఏముంటుందో ఇట్టే తెలిసిపోతుంది. 'టేకిట్ ఈజీ' అన్న పేరు చదవగానే వెంటనే చదివెయ్యాలనిపిస్తుంది. ముందుమాటల్లో ప్రముఖ రచయితలు కబుర్లు చదవగానే కథల్లోకి దూకెయ్యాలని మనసు ఉవ్విళ్ళూరుతుంది. 'కౌముది' రెగ్యులర్ పాఠకులకి డొక్కా శ్రీనివాస ఫణిగారి గురించి, ఈ పుస్తకంలోని గల్పికల్లాంటి కథల గురించి వేరేగా పరిచయం చెయ్యాల్సిన అవసరం లేదు. మిగతా పాఠకులందరికోసం ఈ పుస్తక పరిచయం. 2009-2010 రెండేళ్ళపాటు 'కౌముది'లో ధారావాహికంగా వచ్చిన డొక్కా ఫణిగారి నవ్వుల శీర్షికా భాగాల సంపుటి ఈ పుస్తకం. 'కౌముది'లో సీరియల్‌గా వచ్చినప్పుడు లేని అదనపు ఆకర్షణ ప్రతి కథకీ వేసిన రేఖా చిత్రాలు. ఎక్కడా రాజీపడని, ఎవరినీ నొప్పించని నవ్వుల మతాబాలు ప్రతి పేజీలోనూ, ప్రతి వాక్యంలోనూ రవ్వలు విరజిమ్ముతుంటాయి. ఒక్కసారి చదివి వదిలెయ్యడం కాదు, మంచి కాలక్షేపం కావాలనుకున్నప్పుడల్లా చదవాలనిపిస్తాయి. వీటన్నింటినీ ఒక వరుసలో చదవాల్సిన అవసరం లేదు. ఎప్పుడైనా, ఎక్కడైనా మొదలుపెట్టండి... ఎన్నిసార్లు చదివినా మళ్ళీ మళ్ళీ కడుపుబ్బ నవ్వించే నవ్వుల్ని మీ సొంతం చేసుకోండి. పాత్రల పేర్లలో హాస్యం, సంభాషణల్లో హాస్యం, సన్నివేశాల్లో హాస్యం, రచయిత వ్యాఖ్యానంలో హాస్యం.. ఏ కోణంలోనుంచి చూసినా రచయిత ప్రతిభ కనిపిస్తుంది. వీటిని వ్రాయడానికి రచయిత ఎంత కష్టపడ్డారో కానీ చదువరులకు మాత్రం సరళంగా, సూటిగా తాకి ఆహ్లాదకరమైన భావాలని పంచిపెడతాయి. 'కౌముది'లో ప్రచురితమై గ్రంధరూపంలో వచ్చి, అంతర్జాలంతో పరిచయం లేని పాఠకులని సైతం అలరిస్తున్న 'ప్రేమలేని చోటు ','అమెరికాలక్షేపం కథలు,' 'కాలమ్ దాటని కబుర్లు' పుస్తకాల చెంతన ఇప్పుడు 'టేకిట్ ఈజీ' కూడా చేరింది. మంచి సాహిత్యాన్ని 'కౌముది' పాఠకులు సదా ఆదరిస్తారనడానికి ఇవి ప్రత్యక్ష నిదర్శనాలు. హాస్య రచనల్లో తనకంటూ సొంత శైలిని ఏర్పరచుకున్న రచయిత డొక్కా ఫణిగారి కలం నుంచి మరిన్ని నవ్వుల పువ్వులు విరబూయాలని, వాటిని ముందుగా ఆఘ్రాణించే అవకాశం మన 'కౌముది' పాఠకులకే దక్కాలని ఆశిద్దాం. బలభద్రపాత్రుని రమణి గారన్నట్లు 'జన సామాన్యమైన విషయాలు..మనం రోజూ చూసేవే..ఫణి పెన్నులో పడితే 'డొక్క' బద్దలయ్యేట్టు నవ్వొస్తుంది.! అడుగడుగునా గోదారి యాస కమ్మగా చక్కలిగింతలు పెడుతుంది..భళారే ఫణీ..!'

* **




**సినీ సంగీతానికి స్వర్ణయుగం అనదగిన దశాబ్దాలు** 1980 మధ్యవరకూ కొనసాగాయి. సాహిత్యానికి పెద్దపీట వేసిన దర్శక, నిర్మాతలు- దాన్ని అర్థం చేసుకుని మాటల్ని మింగేయని సంగీతాన్ని అందించిన సంగీత దర్శకులు, పాటలోని భావాన్ని అర్థం చేసుకుని, జీర్ణించుకుని అనుభూతించి పాటలు పాడిన గాయనీ గాయకులు..అన్నీ కలిసి ప్రతి పాటనీ మరపురాని పాటగా చేసిన ఆ యుగం..నిజంగా స్వర్ణయుగం. ప్రస్తుతం వస్తున్న పాటలు..- సంవత్సరాలు వదిలెయ్యండి - కనీసం ఎన్ని రోజులు ప్రేక్షకుల మనసుల్లో నిలుస్తున్నాయన్న ప్రశ్నకి సమాధానం చెప్పడం పెద్ద కష్టమేం కాదు ఈ రోజుకి 50 - 60 సంవత్సరాల క్రిందటి సినిమాలు విడుదలైన కాలంలో ఇంకా కళ్ళు తెరవని, ఈ నాటి యువతరంలో అధికశాతం మంది ఆ నాటి పాటలనే అభిమానిస్తున్నారంటే ఆ పాటల శాశ్వతత్వాన్ని అర్థం చేసుకోవచ్చు. అలాంటి శాశ్వతత్వం కలిగిన పాటలని స్వరపరచిన సంగీతదర్శకులు ఒకరా ఇద్దరా..ఎంతోమంది మహానుభావులు. వారిలో దాదాపు అందరూ శాస్త్రీయ సంగీతంలో నిష్ణాతులే. ఆయా సంగీతదర్శకుల జీవన చిత్రాలు ఎలాంటివి? ఎన్ని అవరోధాలని, ఆటంకాల్ని ఎదుర్కొని అవకాశాలు సంపాదించుకున్నారు, సంపాదించుకున్న అవకాశాలని నిలబెట్టుకోడానికి ఎంత కృషిచేశారు..ఇలాంటి విశేషాలన్నీ తెలుసుకోవడం కేవలం ఆసక్తికరమే కాదు..ఎన్నో నేర్చుకోవాల్సిన పాఠాలు కూడా కనిపిస్తాయి. వాళ్ళ జీవన గాధలని సమగ్రంగా ఆవిష్కరించిన బృహత్తర ప్రణాళిక ఈ గ్రంధం. అప్పుడప్పుడూ అక్కడక్కడా వచ్చిన వ్యాసాల సంకలనం లాగా కాకుండా రచయిత పులగం చిన్నారాయణగారు ఈ పుస్తకంలోని విశేషాలన్నింటినీ స్వయంగా సేకరించారు. దాదాపు రెండేళ్ళపాటు ఎంతో శ్రమించి అలనాటి సంగీతదర్శకుల వారసుల్ని కలుసుకుని సమాచారాన్ని ప్రోదిచేశారు. సేకరించిన సమాచారాన్ని సరళమైన భాషలో, ఉత్సుకత కలిగించే శైలిలో తీర్చిదిద్దారు. కేవలం జీవితగాధలే కాక ఆయా దర్శకుల చిత్రావళి, చాలా సందర్భాల్లో గణాంకాలూ, విశ్లేషణలూ ఇవ్వడం రచయిత కృషిలోని నిజాయితీని, నిబద్ధతనీ చూపిస్తుంది. ఎన్నో అరుదైన, విలువైన చిత్రాలు ఈ పుస్తకానికి అదనపు ఆకర్షణ. ఇంత ప్రత్యేకమైన పుస్తకాన్ని రూపొందించడం వెనుకనున్న శక్తి, సినిమారంగంతో ఏమాత్రం సంబంధం లేని వ్యక్తి కావడం ఒక విశేషం. **www.chimatamusic.com** అనే వెబ్ సైట్ ద్వారా అలనాటి సినీ స్వర్ణయుగపు పాటలని అంతర్జాతీయంగా వున్న తెలుగువారికి అందిస్తున్న శ్రీ చిమట శ్రీనివాసరావు కృషి ఫలితం ఈ అరుదైన గ్రంధం. చిన్న ఆలోచనగా మొదలైన ప్రణాళికని అందమైన గ్రంధంగా తీర్చి దిద్దేవరకూ అవిశ్రాంతంగా శ్రమించిన శ్రీనివాసరావుని ఎంత అభినందించినా సరిపోదు. ఈ బృహత్తర గ్రంధం తెలుగు సినిమా చరిత్రలో తనకంటూ ఒక స్థానాన్ని పదిలపరచుకుంటుందని ఘంటాపథంగా చెప్పొచ్చు. రచయిత చిన్నారాయణ, ప్రణాళికా నిర్వాహకుడు శ్రీనివాసరావు ఎంతైనా అభినందనీయులు.

* **

**Published by:**

**Srinivas Chimata**
**34361 Eucalyptus Terrace**
**Fremont, CA – 94555 USA**
**Chimata.Music@gmail.com**

**చలనచిత్ర రంగంలో** విలక్షణ, విశిష్ట దర్శకుడిగా పేరొందిన శ్రీ సింగీతం శ్రీనివాస రావుగారు వ్రాసిన కథల పుస్తకం ఇది. సింగీతంగారనగానే పుష్పకవిమానం, మయూరి, ఆదిత్య 369, అపూర్వసహోదరులు.. లాంటి ప్రయోగాత్మక, ప్రయోజనాత్మక చిత్రాలు గుర్తుకు వస్తాయి. ప్రయోగాలంటే ఎంతో ఇష్టపడే సింగీతంగారు ప్రేక్షకాకర్షణని ఎప్పుడూ తక్కువ అంచనా వెయ్యలేదు. ఈ రెండింటినీ సమతూకంలో నడిపి, తన పేరు మీద పదికాలాలు నిలిచిపోయే చిత్రాలని రూపొందించారు. ఈ కథల సంపుటి విషయంలోనూ సరిగ్గా అదే ఫార్ముల్యాని పాటించారు. కథా రచనలో ఇదొక సరికొత్త ప్రయోగం. చాలాసార్లు హాస్య కథలంటే  నవ్వించడానికే పరిమితమౌతాయి. అలానే - వ్యంగ్యం వైపు వెళితే ఆరోగ్యకరంగా నవ్వించడమనేది కత్తిమీద సాము. ఈ పరిమితులని అవలీలగా అధిగమిస్తూ- వ్యంగ్యం,హాస్యం,ప్రయోజనం.. మూడింటినీ అత్యంత ప్రతిభావంతంగా ప్రతి కథలోనూ నింపారు సింగీతంగారు. ప్రతి కథకీ ఒక ప్రయోజనం ఉంది. ఐతే చిట్టచివరి పేరా వచ్చే వరకూ కేవలం నవ్వించడానికే వ్రాసినట్లుంటుంది. ముగింపులో ఒక చక్కటి జీవన సత్యాన్ని చెప్పి, మళ్ళీ చదివించేలా, ఆలోచించేలా చేస్తారు. అనగనగా ఒక రాజ్యం..దాని రాజుగారు 'క రాజు'. ఆయనకో మంత్రీ.- ఇదీ కాన్వాసు.. దీని మీద ఎన్నో కడుపుబ్బ నవ్వించే సన్నివేశాలని,సందర్భాలని, పాత్రలనీ అలవోకగా చిత్రించి ఆ రాజ్యం, ఆ రాజుగారు, ఆ మంత్రిగారూ మన చుట్టూనే ఉన్న అనుభూతిని కలిగిస్తారు. 'జీవితంలో ప్రతిభ ఉన్నంత మాత్రాన సరిపోదు..నిచ్చెన ఎక్కగలిగుండాలి', 'ఒక వ్యక్తి ఇలాంటి వాడని ప్రజలు నిర్ణయించేది అతని స్వభావం వల్ల కాదు. అతను వేసే వేషం వల్ల', 'నైపుణ్యం లేనప్పుడు ఒకే నృత్యకారుడు నాట్యం చేస్తుంటే ఎవ్వరూ చూడరు, కాని అలాంటివారు వందమంది చేరి నాట్యం చేస్తుంటే దాన్ని ప్రజలు ఎంతగానో మెచ్చుకుంటారు','ఏ రాజ్యంలోనైనా మనవాడు కదా ని ఎవర్నైనా సలహాదారుడిగా చేస్తే ఆ రాజ్యం గతిమొత్తం తారు మారౌతుంది..'- లాంటి వాక్యాలు చదువుతుంటే చాలా సీరియస్ నీతి సూక్తుల్లా అనిపిస్తాయి కదా. ఐతే  ఈ పుస్తకం లోని కథా గమనంలో మాత్రం ..ప్రతి వాక్యానికీ నవ్వుకుంటారు,ఆ నవ్వుల్లో మీకు తెలీకుండానే గుర్తుంచుకోదగ్గ సమకాలీన సమన్వయం కనిపిస్తుంది. ఇందులోని కథలని ఒక్కసారి చదివి వదిలెయ్యలేము. మళ్ళీ మళ్ళీ చదవాలనిపిస్తాయి..చదివింది పదిమందితో పంచుకోవాలనే భావం కలిగిస్తాయి. సింగీతం శ్రీనివాసరావుగారు తీసిన విజయవంతమైన చిత్రాల స్థాయిలో నిలబడగలిగే కథలివన్నీ. అందుకే ఇప్పటికే మూడుసార్లు పునర్ముద్రణలు పొందింది ఈ పుస్తకం. ఈ పుస్తకం యొక్క ఆత్మ గురించి ముందుమాటలో గొల్లపూడి మారుతిరావుగారు ఇలా చెప్పారు " కేవలం నవ్వించే హాస్యం - వెకిలిగానూ, కొండొకచో వెగటుగానూ ఉండవచ్చు. కాని సమాజశీలాన్ని చిన్నగాటుతో ఉలిక్కి పడేటట్టు చేయడం - ఆరోగ్యకరమైన ఉత్తమ హాస్యం లక్షణం". ఇందుకు ఈ పుస్తకంలోని ప్రతికథా నిలువెత్తు నిదర్శనమే..!

* **




**For copies in India:**
**Visalandhra Publishing House**
**Vijnan Bhavan, 4-1-435 Bank St**
**Hyderabad – 500 001**
**2474 4580 / 2473 5905**
**For copies in US : editor@koumudi.net**
***OR***
kiranprabha@gmail.com




**Sole Distribution:**
Navodaya Book House
Opp.Arya Samaj Mandir
Kachiguda X Roads
Hyderabad – 500 027
*Also at www.kinige.com*

**వర్తమాన రచయితల్లో** తనకంటూ ఒక ఒరవడి సృష్టించుకున్న రచయిత శ్రీ కస్తూరి మురళీకృష్ణ. వివిధ సాహితీ ప్రక్రియల్లో తన ప్రతిభని చాటుకుంటున్నారు. కథలూ, నవలలూ, చారిత్రాత్మక నవలలు, సైంటిఫిక్ కథలూ, వర్తమాన రాజకీయ విశ్లేషణలూ.. అన్నింటిలోనూ తన ప్రత్యేకతని నిరూపించుకుంటున్నారు. ఆయన వ్రాసిన తాజా చారిత్రాత్మక నవల శ్రీకృష్ణదేవరాయలు. విజయనగర సామ్రాజ్య పట్టాభిషిక్తుడవడం వద్దనుంచీ, దక్షిణభారత జైత్రయాత్రకి దారితీసిన పరిస్థితులు, అందుకు శ్రీకృష్ణదేవరాయలు సన్నాహాలు చేసిన వైనం, జైత్రయాత్రను విజయవంతం చేయడం వెనుక ఆయన పాటించిన యుద్ధ తంత్రాలు, రాయలవారి కళాసాహిత్యాభిలాష, యుద్ధవాతావరణంలో కూడా తన కళాభిరుచిని కొనసాగించిన తీరు ...అన్నింటినీ ఎంతో ఆసక్తికరంగా వ్రాశారు. మురళీకృష్ణగారు సన్నివేశాలని వర్ణించిన విధానం ఆయా దృశ్యాలని కళ్ళకి కట్టినట్లు చూపిస్తుంది. సరళమైన రచనా శైలి కూడా రచయితకి పెద్ద ఎస్సెట్. కేవలం సంఘటనలని యధాతథంగా వ్రాస్తే వ్యాసం అయ్యే ప్రమాదం ఉంది. అలా కాకుండా అవసరమైన చోట అవసరమైనంత నాటకీయతని చొప్పించి ఈ పుస్తకానికి పాపులర్ నవలకుండేటంత రీడబిలిటీని తీసుకొచ్చారు. "నేను దేన్నయినా క్షమిస్తాను కానీ ఓటమి ప్రసక్తి రావటాన్ని క్షమించను. ఓటమి అన్న ఆలోచన లీలామాత్రంగా వచ్చినా అది వ్యక్తిని బలహీనుడిని చేస్తుంది..","గాడిద నాయకత్వం వహిస్తే సింహాల సైన్యం కూడా పరాజయం పాలవుతుంది. అదే సింహం నాయకత్వంలో గాడిదల సైన్యం కూడా విజయం సాధిస్తుంది...","మన మనసులో ఎలాంటి ఉద్దేశ్యాలు ఉన్నా లౌకికంగా మనపై ఉన్న బాధ్యతలను నిజాయితీగా, చిత్తశుద్ధిగా నిర్వహించాల్సి ఉంటుంది.." లాంటి వ్యాఖ్యానాలతో ఆయా పాత్రల వ్యక్తిత్వాలని, సన్నివేశాల వెనుకనున్న ఆంతర్యాన్ని చక్కగా చిత్రీకరించారు. కొన్ని కొన్ని కీలక సన్నివేశాలని (రాయలవారి కుమారుడి మరణం, అప్పాజీ రాజకీయ చతురతని ప్రతిబింబించే సంఘటనలు..) మరింత వివరంగా వ్రాసిఉంటే బావుండేదనిపిస్తుంది. ఐతే ఇంత చిన్న పుస్తకంలో అన్నింటినీ సవివరంగా వ్రాయడం సాధ్యపడదు కనుక పాఠకులు అర్థం చేసుకోగలరు. మొత్తానికి ఈ పుస్తకం చదవడం పూర్తయేసరికి ఒక అద్భుత ప్రపంచంలో నుంచి బయటికి వచ్చిన అనుభూతి కలుగుతుంది. రచయిత మురళీకృష్ణ అభినందనీయులు. చరిత్రమీద ఆసక్తి ఉన్నవారికే కాక సాధారణ పాఠకులకి మామూలు నవలగా కూడా చదవడానికి ఇదొక మంచిపుస్తకం.

* **










***Published by:***
***Vahini Book Trust***
***1-9-286/3, Vidyanagar***
***HYDERABAD – 500 044***
***Available:  At Navodaya Book House, Visalandhra Book House,***

**దాసరి సుబ్రహ్మణ్యంగారి పేరు** తెలియని తెలుగు పాఠకులు చాలా మందే ఉంటారు కానీ `చందమామ` పత్రిక గురించి తెలియని తెలుగు పాఠకులుండరు. పిల్లలకోసం గత ఆరుదశాబ్దాలు పైగా వెలువడుతున్న `చందమామ` పత్రికలో 54 ఏళ్ళపాటు ఉద్యోగం చేసిన ప్రాతికేయ రచయిత స్వర్గీయ దాసరి గారు. `చందమామ`లో దాదాపు 30 సంవత్సరాలు పాటు సాగిన 12 సూపర్ సక్సెస్ సీరియల్స్ వ్రాసిన రచయిత దాసరి సుబ్రహ్మణ్యం గారనే విషయం చాలా మందికి తెలీదు. హేరీపోటర్, అవతార్‌లని మించిన కథలని 50 ఏళ్ళక్రిందటే సుబ్రహ్మణ్యం గారు వ్రాశారని తెలుసుకుంటే చాలా ఆశ్చర్యం వేస్తుంది. ఆ విషయానికి వస్తే అసలు దాసరి సుబ్రహ్మణ్యంగారి గురించిన విశేషాలు ఆయన మరణించాకనే బయటి ప్రపంచానికి తెలిశాయి. చివరి వరకూ దాదాపు అజ్ఞాతంగా ఎటువంటి పటాటోపాలూ లేకుండా జీవించిన దాసరిగారి రచనల్లోంచి కొన్నింటిని 3 పుస్తకాలుగా ప్రచురించారు `రచన` శాయిగారు. ఇదొక అనితరసాధ్యమైన ప్రణాళిక. ఎక్కడెక్కడో మరుగున ఉండిపోయిన రచనలని సేకరించడం అంత సులభసాధ్యమైన పని కాదు.  పట్టుదలే పెట్టుబడిగా `రచన`ని కొనసాగిస్తున్న సంపాదకులు శాయిగారికి మాత్రమే ఇది సాధ్యపడింది. ఈ మూడు పుస్తకాలని ఒక సెట్‌గా పాఠకులకి అందిస్తున్నారు. తెలుగుసాహిత్యాభిమానులకివి వెలలేని కానుకలు ఇందులో (1) 'అగ్నిమాల` - `యువ` మాసపత్రికలో 1975లో సంవత్సరంపాటు సీరియల్‌గా వచ్చిన జానపద నవల (2) `మృత్యులోయ` - `బొమ్మరిల్లు` పిల్లల మాసపత్రికలో మూడేళ్ళకు పైగా సాగిన జానపద సీరియల్ (3) దాసరి సుబ్రహ్మణ్యం కథలు - సుబ్రహ్మణ్యం గారు 1940 ప్రాంతాలనుంచి వివిధ పత్రికల్లో వ్రాసిన 39 సాంఘిక కథల సంపుటి. ఈ జానపద నవలల్లో అలనాటి వడ్డాది గారి చిత్రాలని చేర్చడం, కథా సంపుటంలో కూడా ఆయా పత్రికల్లో వచ్చిన శీర్షికా చిత్రాలని చేర్చడం - అద్భుతమైన నాస్టాల్జిక్ ఫీలింగ్‌ని కలిగిస్తుంది. ప్రతి పుస్తకంలోనూ దాసరి సుబ్రహ్మణ్యంగారి గురించిన ప్రత్యేక విశేషాలు  ప్రచురించడం ఈ పుస్తకాలకి అదనపు ఆకర్షణ. అత్యంత అందంగా, నాణ్యతతో ప్రచురించిన ఈ పుస్తకాలు ఉత్తమాభిరుచి గల ప్రతి తెలుగు పాఠకుడి వద్దా తప్పక ఉండాల్సినవి.




**కృష్ణాజిల్లా రచయితల సంఘానికి** అధ్యక్షునిగా పనిచేసిన శ్రీ గుత్తికొండ సుబ్బారావుగారు 1975 ప్రాంతాల్లో వ్రాసిన కవితల సంపుటి ఈ పుస్తకం. తెలుగు కవితోద్యమాలతో పరిచయం ఉన్న ఎవరికైనా సుబ్బారావుగారి పేరు తెలీకుండా ఉండడం అసాధ్యం. 1970లలో హైదరాబాదునీ, తర్వాత మచిలీపట్నాన్ని కేంద్రంగా చేసుకుని వచన కవితా వ్యాప్తికి నిరంతరం శ్రమిస్తున్నారు శ్రీ సుబ్బారావుగారు. ఆయన రచయితగా కంటే ఉద్యమసారధిగా, కార్యకర్తగా తెలుగు సాహిత్యానికి ఎక్కువసేవలు చేశారు. సాహితీ సంస్థలు నడిపారు. సాహితీ పత్రికలని నడిపారు. 1975లో ప్రధమ ప్రచురణ పొందిన ‘మనిషికోసం..‘ కవితా సంపుటి ద్వితీయ ముద్రణ ఇది. కుందుర్తి గారు, సినారె గారు 1975లోనే ఈ పుస్తకానికి వ్రాసిన ముందు మాటలు చదివితే ఆ రోజుల్లోనే సుబ్బారావుగారు ఎంత చురుకుగా కవితోద్యమాల్లో పాలు పంచుకునే వారో తెలుస్తుంది. ఈ సంపుటిలోని కవితల్లో ముఖ్యవస్తువు సామాజిక స్పృహ. ఉగాది, దీపావళి, కొత్తసంవత్సరం, స్వాతంత్ర్య దినోత్సవం – ఇలాంటి ప్రత్యేక సందర్భాల గురించి వ్రాసిన కవితల్లో కూడా రచయితకి సమాజంలో అన్యాయలపట్ల, అక్రమాల పట్ల గల ఆవేదనే ప్రతిఫలిస్తూ ఉంటుంది. ‘జీవితపు యెడారిలో – పూలు పూచే సమయం – అతి దూరంలో వుంది – సముద్రానికి ఆవలి గట్టులా – సమానత్వం కన్పిస్తోంది దూరంగా..‘.. ఈ కవితలన్నీ 1970 దశకంలో వచన కవితా రచయితల్లోని నిజాయితీ ధోరణికి దర్పణాలు.

* **

***For copies:***

**Spandana Sahiti Samakhya**
**Satnam Towers, I Floor**
**Opp to Bakingham Peta P.O**
**Governar Pet, VIJAYAWADA – 520 002**
**Call: 94401 67697**




*Published by:*
*Varanasi Publications*
*303, Edaikode Towers*
*Srinagar Colony*
*HYDERABAD – 500 0173*
*Available: At Navodaya Book House,*
*Visalandhra Book House,*
*AVK Foundation*

**కథారచనకి ఒక ప్రయోజనం అనేది ఉండాలని నమ్మి ,** ఆ నమ్మకాన్ని తన కథల్లో ప్రతిబింబించే ఈ తరం రచయిత్రుల్లో ఒకరు శ్రీమతి వారణాసి నాగలక్ష్మి గారు. లలిత గీత రచయిత్రి, చిత్రకారిణి కూడా ఐన నాగలక్ష్మిగారి కథల్లో ఆ లాలిత్యం తొంగిచూస్తూ ఉంటుంది. 'కౌముది' పాఠకులకి నాగలక్ష్మిగారు చిరపరిచితులే! ఈ కథల్లో కనిపించే పాత్రలు చాలామందికి ఎక్కడో తారసపడినట్లే అనిపిస్తాయి. జీవితాన్ని జీవితంగా చూపిస్తూ మధ్యలో ఎదురయ్యే ఇబ్బందులకీ సమస్యలకీ పరిష్కారం ఇదేనేమో ఆలోచించండి అని మనసుపొరల్ని స్పృశించి వదిలేస్తారు. కథల్లో చెడు ప్రవర్తన గల మనస్తత్వాలు కనిపిస్తాయి కానీ చెడ్డమనుషులు కనిపించరు. రెండు మూడు దశాబ్దాల క్రిందటి కుటుంబ సంబంధ బాంధవ్యాలని గుర్తుచేసే కథలు కొన్నీ (ఒక ప్రేమలేఖ, ప్రేమతో పెద్దత్త, వినిపించని రాగాలు..మొదలైనవి), మారిన కాలం, వేగవంతమైన జీవన విధానాలు, నాలుగు వీధుల కూడలిలో నిలబడ్డ సందేహాస్పద యౌవనాలు..వీటిని ప్రతిబింబించే కథలు ఇంకొన్నీ(సరా, సంధ్యారాగం.. మొదలైనవి) వర్తమాన సామాజిక కోణాలకి నిలువుటద్దంలాంటి కథలు మరికొన్నీ(ప్రగతి ఫలాలు, ఇది కల కాదు, రేపటి ప్రశ్న..మొదలైనవి). కొన్ని కథల ముగింపు చదివిన ప్రతిసారీ కళ్ళు చెమరుస్తాయి. పెద్ద, పెద్ద ఉపన్యాసాలు ఉండవు. సంక్లిష్టమైన కథా శిల్ప భేషజాలు కనిపించవు. ఒక్క వాక్యం చాలదూ అనిపిస్తారు. 'మేఘున' కథ ముగింపులో నాన్నమ్మగారింటి వద్ద ఆంక్షల మధ్య గడిపిన చిన్నారి "ఏమైందంటే ..నాన్నమ్మ నన్ను తిట్టలేదు..కొట్టలేదు..ఎత్తుకోలేదు కూడా.." అంటుంది. "ఎత్తుకోలేదు కూడా.." అన్న రెండు పదాల్లో పసిపాప మనస్తత్వాన్ని పూర్తిగా దర్శింపచేశారు. అలానే ఏ కథలోనైనా పాత్రలతో, తన భాషలో కాక, ఆయా వ్యక్తిత్వాలకి తగినట్లు మాట్లాడించడంలో కూడా నాగలక్ష్మిగారు కథా రచయిత్రిగా మంచి నేర్పు ప్రదర్శించారు. ఈ సంపుటంలో మిగతా కథలకంటే భిన్నంగా నిలిచేవి శ్యామా గోపాళం (హాస్యకథ), మానవ ప్రయాణం (కవితాత్మక అధివాస్తవిక చిత్రణ). ఇవి కూడా నాగలక్ష్మిగారి కలానికున్న విభిన్నతకి దర్పణాలు.

***




**ఇదొక విలక్షణ పద్యగ్రంథం.** సాధారణంగా పద్యకావ్యాలకి వ్యాఖ్యానాలు, లేదా వచనానువాదాలు వ్రాయడం సహజం. ఐతే వచన రచనని, అందునా ఒక ఐ.ఎ.ఎస్. ఆఫీసర్‌గారి స్వీయానుభవాలని పద్యరూపంలో అనుసరణ చేసి పుస్తకంగా వ్రాయడమనేది సరికొత్త ప్రయోగమే కాక అభినందించదగ్గ ప్రయత్నం కూడా. తిరుమల తిరుపతి దేవస్థానానికి కార్యనిర్వాహణాధికారిగా పనిచేసిన శ్రీపి.వి.ఆర్.కె ప్రసాద్ గారు 'నాహం కర్తా హరిః కర్తా' అనే పేరుతోనే తన పరిపాలనానుభవాలని తెలుగు పాఠకులతో పంచుకున్నారు. ఒక వారపత్రికలో సీరియల్‌గా వచ్చినప్పుడు ఆ వ్యాసాలు ఎంతో సంచలనం కలిగించాయి. నిజాయితీగా, నిర్భయంగా వారు వ్రాసిన ఎన్నో తెరవెనుక సంగతులు భక్తులను, సామాన్య పాఠకులను  కూడా ఎంతో ఆకర్షించాయి. పద్య రచనమీద నున్న ప్రేమతో స్వర్గీయ అత్తలూరి నాగభూషణమ్‌గారు ఈ వ్యాసాలని అందమైన పద్యరూపంలో తీసుకొచ్చారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా పదవీ విరమణ చేసిన నాగభూషణమ్‌గారు ఈ పుస్తకానికి కంటే ముందుగానే దాదాపు డజన్‌కి పైగా పద్యగ్రంథాలు వ్రాశారు. అష్టావధానాల్లో కూడా అనుభవజ్ఞులైన నాగభూషణమ్‌గారు ఈ పుస్తకంలో తన పద్య రచనా ప్రతిభని పరిపూర్ణంగా ప్రదర్శించారు. ఐతే ఇది అనుసరణ గ్రంథం కాబట్టి రచయితకి స్వేచ్ఛ తక్కువగా ఉంటుంది. ఎందుకంటే మూలరచయిత ఆలోచనలను, ఉద్దేశాలను అర్థం చేసుకుని, వాటిని ఏమాత్రం వక్రీకరించకుండా తన సొంత ఆవేశాలని, ఆలోచనలని అదుపులో ఉంచుకుంటూ మూలంలోని భావాన్ని మరింత అందంగా పద్యీకరించాలి. నాగభూషణమ్‌గారు ఈ పరిధులన్నింటికీ లోబడుతూనే తన సృజనాత్మకతని ప్రతి పద్యంలోనూ చూపించారు.

"శిలలలోన దాగి నెలకొన్న దైవాల  / కనులలోన శక్తి గగన తరమే?" "జాతికి మేలు కార్యముల సంపద  కావలెనన్న కష్ట / సంఘాతము కొద్దిగానయిన కల్గును కొందరికైన నందుచే / జాతికి మేలు కార్యముల సంపద వద్దన జెల్లునే?" లాంటి పద్యాల్లో మూలభావాన్ని ఎంతో హృద్యంగా అనుసరణ చేసిన ప్రతిభ ద్యోతకమౌతుంది.  పద్యాల పట్ల అభిమానం ఉన్న వాళ్ళేకాక, వచనాన్ని పద్య రూపంలోకి ఎంత అందంగా మార్చవచ్చునోనన్న ఆసక్తి ఉన్నవాళ్ళు కూడా తప్పక చదవాల్సిన పుస్తకం ఇది.* **

***For copies:***

**A.Vasundhara**
**H.No. 74-8-6, Maitri Residency – F - 2**
**Prakash Nagar,Rajahmundry - 533 103**




***కవి, విమర్శకులు అఫ్సర్*** – కవి, కథకుడు, విమర్శకుడు వంశీకృష్ణ లు సంయుక్తంగా రూపొందించిన విలక్షణమైన కవితా సంకలనం ఇది. ‘విలక్షణమైన ‘ అంటే సంకలనకర్తలు ముందు మాటలో చెప్పినట్లు ‘ ఇది కవిత్వంలో సందర్భాల సంకలనం. ఏ సందర్భంలో ఏ కవి ఎలా స్పందించాడు, ఏ చైతన్యంతో స్పందించాడు, తద్వారా కవిత్వ నిర్మాణంలో, వినిర్మాణంలో , లేదా సంతులిత సమాజం వినిర్మాణంలో , నిర్మాణాలలో ఎలాంటి పాత్ర వహించాడు అనేది రికార్డు చేసే సంకలనం మాత్రమే. ఇలా ఎంపిక చేయడం ద్వారా కవిత్వంలో పాతుకుపోయిన భావజాల మొనాటనీని ఛేధించడానికి ఒక ప్రయత్నం యిది‘ . గ్లోబలీకరణ వాయు వేగాన్ని మించిపోయిన గత దశాబ్దంలో వెలువడిన కవితల్లో దాదాపు 200 కవితలని ఎంపికచేసి ‘అనేక‘ రూపంలో మనముందుకి తెచ్చారు. సంకలనకర్తలు చెప్పినట్లే కవితలలోని స్పందనను బట్టి వీటిని ‘అక్షరం‘,‘ ‘అనుభవం‘,‘ అస్తిత్వం‘ ,‘ అలజడి‘ ,‘ఆందోళన‘, ‘అతడు–ఆమె‘ ‘ఆవలితీరం‘,‘అనంతరం‘ అనే అధ్యాయాలుగా విభజించారు. వేలాది కవితల్లోంచి కొన్నింటిని ఎన్నుకోవడమే ఒక శ్రమ ఐతే, వాటిని విశ్లేషించి వర్గీకరించడం అంటే ప్రతి కవితలోని ఆత్మనీ ఎంతో సూక్ష్మంగా పరిశీలించాలి. ఈ బృహత్ప్రణాళికని ఫలవంతం చేయడంలో సంకలన కర్తలు పూర్తి విజయాన్ని సాధించారు. కవితా ప్రియులకీ సంకలనం విందుభోజనం లాంటిది. పదేళ్ళ వ్యవధిలో, వివిధ స్పందనలని ప్రతిబింబించే కవితలు కాబట్టి వస్తు వైవిధ్యం కూడా చాలా విశాలంగా ఉంది. అన్ని మాధ్యమాలనుంచి కవితలు సేకరించారు కాబట్టి అంతర్జాలంలో ప్రచురితమైన కవితలు కూడా ఇందులో చోటుచేసుకోవడం ఒక శుభ పరిణామం. ‘ప్రపంచీకరణ నీడలో పదేళ్ళు‘ శీర్షికతో సంకలన కర్తలు వ్రాసిన ముందుమాట సైద్ధాంతిక వ్యాసంలా, ఆలోచింపచేసేలా ఉంది. ఈ పదేళ్ళలో ఉత్తరాంధ్ర, తెలంగాణా కవులతో పోలిస్తే కోస్తా ఆంధ్రా కవులు ఏ కారణంతో వెనకబడి పోయారో కూడా వివరించారు. .. ఈ విశేష సంకలనం కోసం కృషి చేసిన సంకలన కర్తలని, ప్రచురణ కర్తలనీ అభినందించి తీరాలి.

***

***Published by:***

***Palapitta Books***
***Flat No. 3, MIG - II***
***Block - 6, A.P.H.B***
***Baghlingampally***
***HYDERABAD – 500 044***
***Phone: 2767 8430***
***Available: At all book stores in AP***




**For copies:**

**Vidya Graphics Pvt.Ltd**
**Plot# 4, Behind Metro**
**Kukatpally , Hyderabad - 500 072**

**www.humanlifefoundation.in**
**www.saividyafoundation.com**
**www.vidyamagazine.com**

***షిరిడి సాయి భక్తులకి ఈ గ్రంథం వెలలేని కానుక.*** 200 పైగా పేజీలలో దాదాపు 500 పైగా నిలువెత్తు కలర్ ఫోటోలతో కూర్చిన గ్రంథం ఇది. సాయిబాబాని వివిధ కోణాల్లో, వివిధ సమయాల్లో, వివిధ అలంకరణల్లో ప్రత్యేక అనుమతితో తీసిన బహువర్ణ ఛాయాచిత్రాలు, ప్రత్యక్షంగా సాయిబాబాని దర్శిస్తున్న అనుభూతిని కలిగిస్తాయి. ప్రతి పేజీలోనూ షిరిడీసాయి సూక్తులని ఇంగ్లీషులో ముద్రించారు. అలానే షిరిడీసాయి దేవాలయం గురించిన క్లుప్తపరిచయం, సాయిబాబా వాడిన అలనాటి వస్తువుల ఛాయా చిత్రాలు కూడా ఇందులో చోటుచేసుకున్నాయి. ఎన్నో ఏళ్ళు శ్రమించి, ప్రత్యేక అనుమతులు తీసుకుని, ప్రత్యేక కెమేరాలతో తీసిన వేలాది ఫోటోలనుంచి జీవత్వం ఉట్టిపడే అయిదువందల చిత్రాలని ఎంపికచేశారు. వర్ణచిత్రాల ముద్రణ, ఈ గ్రంధాన్ని అలంకరించిన తీరు అంతర్జాతీయ ప్రమాణాలకి ఏమాత్రం తీసిపోవడం లేదు. విద్యాధికులు, ప్రముఖ జర్నలిస్టు, సాయి భక్తులు ఐన డా. కుమార్ అన్నవరపు, శ్రీమతి రాజేశ్వరి అన్నవరపు గార్లు చేసిన కృషి ఈ గ్రంథంలోని ప్రతి పుటలోనూ కనిపిస్తుంది. షిరిడి సాయి భక్తులు కలకాలం దాచుకుని, అనునిత్యం పూజించదగ్గ ఈ విలువైన గ్రంథం వెల 'అమూల్యం' అని పేర్కొనడంలో కుమార్ అన్నవరపు గారి సేవాదృక్పథం విస్పష్టంగా తెలుస్తోంది. పరిమితమైన కాపీలు మాత్రమే ముద్రించబడిన ఈ విశిష్ట వర్ణ ఛాయాచిత్ర గ్రంథం కావాలనుకున్న వారు సూటిగా ప్రచురణకర్తలని సంప్రదించవలసిందిగా పేర్కొన్నారు.

***




**కథలు, నవలలు, వ్యాసాలు,** యదార్థగాథలు, చారిత్రాత్మకాలు, సమకాలీన సమస్యలపై విశ్లేషణలు..ఎన్నో సాహితీప్రక్రియల్లో తనని తాను నిరూపించుకున్న రచయిత కస్తూరి మురళీకృష్ణ గారు. ఆయన కలంనుంచి వెలువడిన విభిన్న తరహా కథల సంపుటి ఈ పుస్తకం. తెలుగులో శాస్త్రవిజ్ఞానాన్ని ప్రాతిపదికగా చేసుకుని వ్రాసిన రచనలు చాలా పరిమితంగా వెలువడ్డాయి. ఇలాంటి రచనలు చేయడానికి కేవలం కల్పనే కాక, ఎంతో విషయసేకరణ కూడా చెయ్యాల్సి ఉంటుంది. ఊహనీ, సైన్సునీ సరైన పాళ్ళలో రంగరించి పాఠకులని కట్టిపడేసేలా వ్రాయడం కత్తిమీద సాములాంటిది. సైన్సుఫిక్షన్ పేరుతో సేకరించిన విషయాలన్నింటినీ వ్రాసుకుంటూ పోతే అందులో ఫిక్షన్ కంటే సైన్సే ఎక్కువగా కనిపిస్తుంది. లోగడ తెలుగులో ఇతర రచయితలు వ్రాసిన కొన్ని నవలల విషయంలో ఇదే జరిగింది. మురళీకృష్ణగారు మాత్రం ఈ విషయంలో అత్యద్భుతమైన విజయం సాధించారు. సైన్సు ఫిక్షన్ అని చెప్పినా సైన్సు విశేషాలని అంతర్లీనంగానే ఉంచుతూ, అవసరమైనంత వరకే ముందుకి తీసుకొచ్చి సాంఘిక, సస్పెన్స్ కథలకి ఏమాత్రం తీసిపోకుండా ఈ కథలని తీర్చిదిద్దారు. అత్యంత సంక్లిష్టమైన సాంకేతిక విశేషాలని సైతం అరటిపండు వొలిచి అరచేతిలో పెట్టినట్లు సరళమైన శైలిలో వివరించారు. ఈ పది కథల్లోనూ ఒకదాని నీడ మరో దానిమీద పడకుండా చాలా జాగ్రత్త వహించారు. బుధగ్రహ వాతావరణం, సైబర్ యుద్ధాలు, కల్పిత ప్రపంచంలో కేళీ విలాసాలు, అధ్యాత్మిక్ – అద్వైత్‌లతో చూపించిన పునఃసృష్టికి పురిటి నొప్పులు – ప్రతి కథా ఒక సరికొత్త ప్రపంచాన్ని మనసు ముంగిళ్ళలో ఆవిష్కరిస్తాయి. అంతేకాదు, అనాయాసంగా పాఠకుడ్ని ఆ వాతావరణంలోకి తీసుకెళ్ళిపోతాయి. చక్కటి ప్రయత్నాన్ని అర్థవంతంగా, సమర్థవంతంగా తెలుగు పాఠకులకి అందించిన మురళీకృష్ణగారు అభినందనీయులు. ***

***Published by :***
***K.Padma***
***Kasturi Pracuranalu***
***Plot# 32, Dammayiguda***
***HYDERABAD – 500 083***
***Phone:98496 17392***

***Sole Distribution:  Navodaya Book House***




**Writer:**
**KS Panduranga Rao**
**21/414-2 Bhaskarapuram**
**MACHILIPATNAM – 521 001**
**Phone: 08672 - 222975**

**మహాభారతంలో కురుక్షేత్ర యుద్ధం** ముగిశాక భీష్మాచార్యులవారు మాఘ శుద్ధ ఏకాదశి రోజున స్వేఛ్ఛామరణాన్ని కౌగలించుకుని ఈ లోకాన్ని వీడివెళ్ళారు. తదుపరి కార్యక్రమాలన్నీ ముగిశాక ధర్మరాజుని మరోసారి వైరాగ్యం ఆవరించింది. 'కురుక్షేత్ర యుద్ధంలో ఎంతోమంది చావుకి కారణమయ్యాను. మనశ్శాంతికోసం అడవులకి వెళ్ళిపోతాను అనుజ్ఞనివ్వండి' అని శ్రీకృష్ణుడ్ని అడిగాడు. అప్పుడు శ్రీకృష్ణుడు 'అడవులకి వెళ్తే మాత్రం మనశ్శాంతి దొరుకుతుందని నమ్మకమేమిటి? యుద్ధంవల్ల కలిగిన పాపం పోవడానికి, మనశ్శాంతికోసం అశ్వమేధయాగం చేస్తారు. నువ్వు కూడా అశ్వమేధయాగం చెయ్యి. చిత్తశాంతి లభిస్తుంది' అని సలహాయిస్తాడు...ఈ సంఘటన పునాదిగా సాగిన ఈ పుస్తకం వివిధ పండితులు వ్రాసిన మహాభారత కథల సారాంశంగా రూపుదిద్దుకుంది. సరళ గ్రాంధిక భాషలో సాగిన ఈ పుస్తకంలోని ప్రతి సంఘటన ఎంతో ఆసక్తికరంగా పాఠకులని అలరిస్తుంది. కథామూలం కురుక్షేత్ర యుద్ధానంతరమే ఐనా సందర్భానుసారం గతంలో జరిగిన ఎన్నో సంఘటనలని వివరణాత్మకంగానూ, విశ్లేషణాత్మకంగానూ చొప్పించి ఈ పుస్తకానికి సరికొత్త రూపాన్నిచ్చారు రచయిత కోడూరు శ్రీపాండురంగారావు గారు. ఈ గ్రంధరచనకు ఆంధ్ర మహాభారతం, జైమిని భారతం, హరివంశం, విజయవిలాసం లాంటి పది గ్రంధాలని తులనాత్మకంగా పరిశీలించి, కథకి అవసరమైన పాత్రలని, సంఘటనలని గుదిగ్రుచ్చారు. 23 అధ్యాయాలుగా సాగిన గ్రంథంలో మహాభారతంనుంచి ఎక్కువగా ప్రాచుర్యంలో లేని అనేక పాత్రలని , సంఘటనలనీ కూడా ఒక చోట తెలుసుకునే అవకాశం కల్పించారు. కోడూరు శ్రీపాండురంగారావు గారు 70 ఏళ్ళు పైబడిన వయసులో చేసిన ఈ కృషి, పరిశోధన యువరచయితలకి మార్గదర్శకం, స్ఫూర్తిదాయకం.

***




**తెలుగుసాహిత్యానికి** ప్రత్యేకమైన అలంకారంగా భాసిల్లుతున్న పద్య ప్రక్రియకి శతాబ్దాల వైభవోపేతమైన చరిత్ర ఉంది. పద్యాలంటే, ఎక్కువగా, సాహితీ పాండితికి ప్రతీకలుగాను, లేదా దేవతామూర్తుల ప్రసంశలకు ఉదాహరణలుగానో చేసిన విశ్లేషణలు పుస్తకరూపాలలో వచ్చాయి. ఈ ధోరణికి భిన్నంగా, పద్యాన్ని మన ఉన్నతమైన జీవన విలువల మార్గదర్శిగా, వ్యక్తిత్వ వికాసదర్శినిగా చూపించింది ఈ చిన్ని పుస్తకం. రచయిత మాటల్లోనే చెప్పాలంటే "ఒక పద్యం ఒలికితే తెలుగు పదాలు, తెలుగువారి జీవన విధానంలోని కొన్ని అంశాలు, తెలుగు కవితా స్వరూపం, తెలుగు నుడికారాలు, సామెతలు మొదలైన ఎన్నో బతుకుతాయని చెప్పవచ్చు. వీటన్నింటితో పాటు ఒక మనిషి వ్యక్తిత్వ నిర్మాణాని కవసరమయే సందేశాలు కూడా పద్యాల్లో ఉంటాయి. అందుకే ఈ ప్రయత్నం చేశాను." ఈ ఆశయం నెరవేరడానికి రచయిత ఎంచుకున్న పద్యాలు కూడా ఎంతో సరళమైనవి. భాషాడంబరంతో సాధారణ పాఠకులని భయపెట్టేవి కాదు. ఛందోబద్ధంగా వ్రాయాల్సిన పద్యాలని కవి ప్రతిభావంతంగా చిత్రించగలిగితే ఒక సౌందర్యవంతమైన లయని వాటిలో పొదగవచ్చు. తద్వారా సామాన్య ప్రజల నాలుకమీద ఆ పద్యం శతాబ్దాలు గడిచినా మిగిలే ఉంటుంది. "బ్రతుకవచ్చు, బహుబంధనములైన / వచ్చుగాక , లేమి వచ్చుగాక / జీవధనములైన చెడుగాక, పడుగాక / మాట తిరుగలేరు మాన ధనులు ' అవడానికి అదీ మహాభారతం కథాంశమే కానీ ఇలాంటి పద్యాలు సార్వజనీనంగా, స్వతంత్ర ప్రతిపత్తితో కూడా నిలవడానికి ప్రధానకారణం వాటిలోని భావమే. వేమన, సుమతి మొదలైన శతకాలనుంచి, భారత భాగవతాలు మరికొన్ని ప్రబంధాలనుంచి ఈ పద్యాలని ఏర్చికూర్చారు. పద్యాన్ని సాహిత్యదృష్టితో కంటే సామాన్య దృష్టితో చూస్తూ కేవలం ప్రతిపదార్థం కాక పద్యంలోని సందేశాన్ని క్లుప్తంగా, చదవించే శైలిలో వ్రాసారు. చాలా పద్యాల వివరణ ఒక పేజీకి మించకుండా వ్రాసి పాఠకుడికి ఏమి అందించాలనుకున్నారో దానిమీదనే రచనని కేంద్రీకరించడంలో కూడా రచయిత విజయవంతమయ్యారు. ప్రతి పద్య సారాంశాన్ని ఒక నీతి వాక్యంలో సంక్షిప్తీకరించడం కూడా ఈ చిన్ని పుస్తకానికి అదనపు ఆకర్షణగా నిలిచింది. అందరూ చదివి, ముఖ్యంగా ఈ తరం యువతతో చదివించాల్సిన పుస్తకం ఇది. రచయిత ప్రయత్నం బహు అభినందనీయం. ***

***Author:***

***Samatha Prachuranalu***
***10-3-537 Vivekanandapuri***
***Karimnagar – 505 001***
***Phone:0878-2229880***

***Copies available at Navodaya Book House and Visalandhra Book House***




**రోజు, రోజుకీ కొత్తకోణాలు** సంతరించుకుంటున్న గ్లోబలీకరణ, సాంకేతికాభివృద్ధితో ఈ తరం జీవన విధానాలు ఎంత ఒత్తిడితో కూడి ఉంటున్నాయో అందరికీ తెలిసిందే. అందువల్లనే యోగ, ధ్యానం లాంటి ప్రక్రియలకి ఇంతకు ముందెన్నడూ లేనంత ప్రాచుర్యం లభిస్తోంది. కొన్ని దశాబ్దాల క్రిందట వయసుమళ్ళిన తరానికే పరిమితమైన 'ధ్యానం' లాంటివి ఈనాడు యువతరానికి కూడా ఎంతో అవసరంగా కనిపిస్తున్నాయి. వాళ్ళు అభ్యసిస్తున్నారు కూడా. కొన్ని కార్పొరేట్ ఆఫీసుల్లో కూడా ఈ మెడిటేషన్‌ని అమలుపరచడం గమనించదగ్గ విషయం. అసలు ధ్యానం అంటే ఏమిటి, ఎందుకు చెయ్యాలి, లాంటి ప్రాధమిక అంశాలతో ఈ పుస్తకం మొదలౌతుంది. ఆంధ్రా యూనివర్సిటీలో సైకాలజీ ప్రొఫెసర్, ఇన్సిటిట్యూట్ ఫర్ యోగ అండ్ కాన్షియస్నెస్ డైరెక్టర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ పి.వి.కృష్ణారావు గారు పన్నెండేళ్ళ క్రిందటే వ్రాసిన వందపేజీల పుస్తకం ఇది. మొదటి సారిగా విడుదలయ్యాక, వరుసగా ఐదేళ్ళు పునర్ముద్రణకు రావడం ఈ పుస్తకానికి లభించిన ఆదరణకి ఒక ఉదాహరణ. ధ్యానం,ధ్యాన మనో విజ్ఞానం, మనస్సు-ధ్యానం, ధ్యానానికి సన్నాహాలు అవరోధాలు, ధ్యాన పద్ధతులు, నిత్యజీవితంలో ధ్యానం .. అధ్యాయాల్లో మెడిటేషన్‌ని 360 డిగ్రీల పరిధిలో వివరించారు. రచయిత అనుసరించిన శైలి, మధ్య అవసరమైన చోట ఆంగ్ల సమానార్థకాలని పొందుపరచడం వల్ల కూడా ఈ పుస్తకం అందరికీ అర్థమయ్యే రీతిలో రూపుదిద్దుకుంది. ధ్యానం చెయ్యాలనుకున్నా, లేకున్నా ఆ ప్రక్రియ లోతుపాతుల్ని కూలంకషంగా తెలుసుకోవాలనుకున్న వారందరూ చదవాల్సిన పుస్తకం ఇది. రచయిత ఈ అంశం మీద సాధికారికత ఉన్నవారు కావడం వల్ల ఈ రచన విలువ పెరిగింది.

***

***Publishers:***
***Navasahiti Book House***
***Eluru Road, Near Ramamandiram***
***VIJAYAWADA – 520 002***
***Phone: 242 3885***




*Author:*
***JUBV Prasad***
***10401, North Blaney Avenue***
***Cupertino***
***CA 95014, USA***
***408-202-4704***
***jubv@yahoo.com***
***Copies available at Navodaya Book House***

**అమెరికాలోని ప్రవాసాంధ్ర రచయితల్లో** సొంతగొంతు వున్న రచయితగా జె.యు.బి.వి.ప్రసాద్ సీరియస్ పాఠకులకి సుపరిచితులే. వీరి కథల్లో రొటీన్ సంఘటనలు, రొటీన్ కథాంశాలు ఉండవు. రచయిత ముందు మాటలో చెప్పారు "ఈ కథలన్నింటికీ ఆధారం: నా అనుభవాలూ, జ్ఞాపకాలూ, ఇతరులు చెప్పగా విన్నవీ, స్వయంగా చూసినవీ.." అని. అలానే "రామాయణ విషవృక్షం చదివాక తర్కంతో ఆలోచించడం నేర్చుకుని నాస్తికుడిగా మారిపోయాను" అని కూడా తనగురించి పరిచయం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వీరి కథలని పరిశీలిస్తే అన్నింటిలోనూ రచయితకి గల నిబద్ధత, తాను నమ్మిన విలువలకి కట్టుబడిఉండే దృఢనిశ్చయం ప్రతి వాక్యంలో కనిపిస్తాయి. ఏ ఒక్క కథా ఊహాజనితంగా, కాల్పనిక జగత్తునుంచి ఊడిపడినట్లనిపించదు. అన్ని సంఘటనలకీ ఒక మూలం, నేపథ్యం ఉన్నట్టు సుస్పష్టంగా తెలుస్తుంది. అందుకే రచయిత వాదంతో ఏకీభవించినా ఏకీభవించకపోయినా రచయిత నిజాయితీని మాత్రం అభినందించి తీరాలనిపిస్తుంది. అమెరికా జీవన విధానాలగురించి (ఆ కుటుంబంతో ఒక రోజు, పోలీసాయన, అమెరికాలో రుబ్బురోలూ..), మూఢనమ్మకాలు, ఆచారాలు, అలవాట్ల గురించి ( మైల, మంత్రాలకి శక్తి ఉందా, నాస్తికభర్త, విధాయకం, జన్మదినరాహిత్యం, చాదస్తం..) రచయిత సృష్టించిన సన్నివేశాలు, పాత్రలూ పాఠకుణ్ణి ఆలోచింపచేస్తాయి. అలానే దిగువ మధ్యతరగతి జీవితాల్లో పెరిగే పిల్లల మనస్తత్వాల గురించిన కష్టార్జితం, ప్రశ్న, భయం..భయం, పుస్తకం .. లాంటి కథలు కరుణరసాత్మకంగా సాగుతాయి. పుస్తకంలోని 20 కథలూ చదవడం పూర్తయే సరికి రచయిత ఏ కథ వ్రాసినా ఒక ప్రయోజనాన్ని ఆశిస్తారన్న విషయం స్పష్టమౌతుంది. మంచి పుస్తకం చదివామన్న తృప్తి మిగులుతుంది.

***




**పుట్టిన వూరు కన్నతల్లితో సమానం అంటారు.** కన్నతల్లిమీద ఎంత మమతానురాగాలు ఉంటాయో పుట్టిన గడ్డమీద కూడా అంతే అవ్యాజాను రాగాలు ఉండడం అతి సహజం. ఈ పుస్తక రచయిత్రి కోరుపోలు కళావతిగారికి తమ విజయనగరం అంటే అంతులేని అభిమానమని ఈ పుస్తకం ఋజువుచేస్తుంది. విజయనగరం పట్టణాన్ని వివిధ కోణాల్లో దర్శిస్తూ ఈ పుస్తకం రచించారు. విజయనగరంలోని వివిధ చారిత్రిక ప్రదేశాల గురించి, విజయనగరం నేల మీద పరిఢవిల్లిన సంగీత సాహిత్య ప్రతిభావంతులగురించి రచయిత్రి తనదైన విలక్షణ శైలిలో వివరించారు. ఘంటసాల, సుశీల, శ్రీశ్రీ, గురజాడ, చాగంటి..ప్రభృతుల గురించిన అధ్యాయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. అలానే పుణ్యగిరి, రామతీర్థం, సరస్వతీ ఆలయం, సంస్కృత కళాశాలల గురించి కూడా వ్రాశారు. చారిత్రక సత్యాలు, వాస్తవాల చిత్రణకంటే రచయిత్రి స్పందనలు, భావావేశాలు ఎక్కువగా కనిపిస్తాయి ఈ అధ్యాయాల్లో. ఘంటసాల గురించి మూడు అధ్యాయాలు, గురజాడ గురించి రెండు అధ్యాయాలు వ్రాయడంలో రచయిత్రికి సంగీత సాహిత్యాల పట్ల గల మక్కువని సూచిస్తుంది. అలానే వీలైనన్ని చోట్ల సంగీతం, సాహిత్యాల గురించి రచయిత్రి తనదైన శైలిలో వ్యాఖ్యానించారు. అందులో మచ్చుకు ఒకటి రెండు "శతకోటి భావాలు బలికించె సరిగమ మధురిమలు చిలికి ఎనలేని రాగాలకు రారాజై.అణిగి మణిగి ఆలపించి ఆమని కోకిలై పాటల పర్ణశాలలో కవిత కోకిలై భారతావనికే పరవశింపజేసే గాన మాధుర్యంతో ఆనంద సాగమైనది ", " రసమయ రసానందమే పల్లవించే కళావిష్కరణ రమణీయ కమనీయ కావ్య గీతాంజలై, సున్నితమైన సాహిత్య లలితమై సంగీతం నిత్య జీవన వాహిణై సాగే సాహితే  సమృద్ధి జీవనది విరిసే అలల గీతాలై గాయకుని హృది నిశిదైన నిద్రపోదు." ఇలా సాగుతాయి వర్ణనలు, హృదయ స్పందనలు. అచ్చుతప్పులసరి చేసి ఉంటే వాక్యాలు కాస్త తేలికగ అర్థమవడానికి అవకాశాలు ఎక్కువగా ఉండేవి.

***

*Author:*

***Korupolu Kalavathi***
***Kala Nilayam***
***Kamakshi Nagar***
***Vizianagaram***
***India***




**దాదాపు మూడు దశాబ్దాల క్రిందట పురాణం సీతగారు (పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారు) వ్రాసిన** 'ఇల్లాలి ముచ్చట్లు' తెలుగు సాహితీ లోకంలో ఒక ప్రత్యేక స్థానాన్ని తెచ్చుకున్నాయి. ఇప్పుడు శ్యామలా దశికగారు వ్రాసిన 'అమెరికా ఇల్లాలి ముచ్చట్లు' అమెరికా తెలుగు సాహితీలోకంలో ఖచ్చితంగా తనదైన ముద్రతో నిలుస్తుందని ఈ పుస్తకం చదివిన వారందరూ ఒప్పుకుంటారు. ఒక సగటు అమెరికా తెలుగు ఇల్లాలు మనసులోని మాటలు 'అమెరికా ఇల్లాలి ముచ్చట్లు'గా మన 'కౌముది'లో వచ్చిన సీరియల్ శీర్షికలతో బాటుగా కొన్ని మ్యూజింగ్స్, మరికొన్ని చిన్న కథలూ కలిసి చక్కటి సంపుటిగా ముస్తాబయింది ఈ పుస్తకం. ఇందులోని శీర్షికలన్నీ అమెరికాలోని తెలుగు జీవితాలకి ప్రతిబింబాలే. చిన్న చిన్న వాక్యాలు, సరళమైన పదప్రయోగాలు.. చదువుతున్నంత సేపూ ఎవరో ఆత్మీయులు మనతో మనసువిప్పి కబుర్లు చెబుతున్నట్లుంటుంది. చాలామంది ఇతర ప్రవాసాంధ్ర రచయితలు వ్రాసిన ఎన్నో సీరియస్ అంశాలని కూడా తనదైన సరదా శైలిలో చెప్పారు. కొన్ని ఉదాహరణలు చెప్పుకోవాలంటే ఇల్లాలి ముచ్చట్లుగా రచయిత్రి స్వగతంలోంచి వచ్చినట్లనిపించే కబుర్లలో ఆమె స్పృశించిన సున్నితమైన అంశాలు 'వావ్' అనిపిస్తాయి. 'హేండ్ బేగ్' గురించి రకరకాల కోణాల్లో అన్నీ చెప్పి చివరికి 'పైకి ఎంతో మెత్తగా, సుకుమారంగా కనబడే ఈ హ్యాండు బ్యాగులోపల ఎంతో బరువును మోస్తూ ఉంటాయి..ఆడదానిలాగే!' అనే కొసమెరుపుతో మనసుని కలుక్కు మనిపిస్తారు. మూడు, నాలుగు దశాబ్దాల క్రిందట అమెరికా వచ్చిన సగటు తెలుగు గృహిణులు ఎదుర్కొన్న విచిత్రమైన అనుభవాలని, కష్టాలని కొన్ని ముచ్చట్లలో వివరించారు. ఒక వైపు భర్తని సాధిస్తున్నట్లు వ్రాసినా, వారిద్దరి మధ్యా వున్న ప్రేమానుభూతుల్ని అంతర్లీనంగా కొనసాగించడంలో శ్యామలగారు రచయిత్రిగా తన ప్రతిభని ప్రదర్శించారు. ఎప్పుడూ ఆఫీసు పనుల్లో మునిగి తేలుతూ ఇంటికి ఆలశ్యంగా వస్తారని భర్తని ఎత్తిపొడుస్తూనే చివరలో 'అలిసిపోయి ఇంటికి వచ్చి సోఫాలో అక్కడే చిన్నపిల్లాడల్లే నిద్రపోతారు.. మన పెళ్ళైనప్పటినుంచి అనుక్షణం మిమ్మల్ని చూసుకోవడంతోటే సరిపోతోంది నాకు.. రేపు నేను లేనప్పుడు ఎలా బతుకుతారో 'ఏమో!..' అనే ఇల్లాలి మనసులోని ఈ మాటలు చాలామంది ఇల్లాళ్ళ మనసులోని మాటలుగా అనిపిస్తాయి. బాపు గారి ముఖచిత్రం ఈ పుస్తకానికి అదనపు అందాన్ని సంతరించి పెట్టింది. ***

*Author :*

***Syamaladevi Dasika***
***5 Bradley Court***
***North Burnswick***
***NJ 08092, USA***
***732-247-4688***
***rsdasika@mail.com***




**ప్రతి మనిషికీ ఎదురయ్యేది బాహ్యా జగత్తు ఐతే ప్రతి నిమిషం అతనిలో అతనితో ఉండేది అంతర్జగత్తు.** చాలా సార్లు మన సమస్యలకీ, అనుభవాలకీ బాహ్య ప్రపంచమే పూర్తి కారణం అనుకుంటాం కానీ మనల్ని నియ్రతించేది మన అంతర్జగత్తు అన్న సంగతి మర్చిపోతుంటాం. మన అంతర్జగత్తులోకి నిరంతరం తొంగిచూస్తూ, అంతరాంతరాల్లోని ఆలోచనలకి పదును పెట్టనంతకాలం మనల్ని మనం తెలుసుకోలేం. ఇలా ..ఎంతకాలం..ఇంకా ఎన్నాళ్ళిలా ? అని ప్రశ్నిస్తూ పి.వి.కృష్ణారావు గారు కవితా రూపంలో అందించిన మనో మధనం ఈ పుస్తకం. 'చేతనం నుంచి అచేతనాన్ని / గతం నుంచి అనుభవాల నిజంలోకి / నన్ను నేను వెతుక్కుందామని / ప్రయత్నిస్తున్నాను నేస్తం.!' అంటూ దాదాపు 40 ఏళ్ళక్రిందటే (1972లో వ్రాసిన ఈ పుస్తకంలోని మొదటి కవితలోవి ఈ పంక్తులు) తన నిరంతర చింతనా ప్రయాణాన్ని ప్రారంభించిన శ్రీ కృష్ణారావు గారు వ్రాసిన 15 కవితల సంపుటి ఈ పుస్తకం. కవితలు వ్రాసిన కాలాన్ని గమనిస్తే విరివిగా వ్రాసే రచయిత కాదు కానీ వ్రాసిన ప్రతి కవితలోనూ నిగూఢమైన తాత్విక చింతనని నిక్షిప్తం చెయ్యాలన్న తపన ఉన్న రచయితగా పాఠకులకి దగ్గరౌతారు. ఇందులో ఉన్న కవితలేవీ కేవలం చదివి మరిచిపోయేందుకు కాదు, మళ్ళీ మళ్ళీ చదివి అందులోని అసలు భావాన్ని అర్థం చేసుకుని ఆలోచించాల్సిన కవితలు. "వీటిల్ని కవితలనడం కంటే సుషిప్తిని వెలిగించే దీపాలనవచ్చు. వీటిని చదివితే 'అధైర్యం, భయం, స్వార్థం, కామేచ్ఛ, పలాయనత్వం, పరాయిపీడన, ఆత్మపీడన రెండు నాల్కల తత్వం ..ఇవన్నీ అంతరంగంలో ప్రశ్నకు పెట్టబడతాయి.." అని పుస్తక ప్రచురణకర్తలు పేర్కొన్నారు. "మనో విజ్ఞాన శాస్త్రం అధ్యయనం, విశ్వవిద్యాలయ అధ్యాపక పరిశోధక వృత్తి."లలో 36 సంవత్సరాలు పనిచేసిన శ్రీ కృష్ణారావుగారు రచించిన ఈ విభిన్న కవితా సంపుటి, సీరియస్ పాఠకులకి తప్పక నచ్చి తీరుతుంది..

. ***

*ప్రచురణ:*
*బోధిసత్వ పుస్తకమాల*
*9-31-6/2 షణ్ముఖ ఫ్లాట్స్*
*కూరగాయల మార్కెట్టు ఎదురుగా*
*పిఠాపురం కాలనీ, విశాఖపట్నం - 530 003*
*విశాలాంధ్ర బుక్ హౌస్‌లలో లభ్యం*




**Author :**
**432 , Indigo Ridge Drive**
**Columbia SC 29229 USA**
**(803) 865 – 2634**
**rvinnako@yahoo.com**

**'రవి కాంచని చోట కవి కాంచున్'** అన్నది ఆర్యోక్తి. ఐతే మిగతా కవులెవరూ చూడని, చూడలేని కవితా వస్తువుల్ని చూడగలగడం రవిశంకర్ గారి ప్రత్యేకత. విభిన్నమైన  అంశాలని స్పృశించడమే కాక వాటిని అసలు సిసలైన కవితా రూపంలో వ్యక్తీకరించడం కూడా రవిశంకర్ గారి మరో ప్రత్యేకత. ఈ కవితా సంపుటి పేరు 'రెండో పాత్ర' మకుటంగ వ్రాసిన ఒక్క కవిత చాలు పై వాక్యాలని నిరూపించడానికి. 'ఆమె'కి బహుపాత్రభినయం తప్పని సరి. 'ఆమె' జీవితమే అంత. ఐతే 'పగలంతా పాల వాసన వెంట  / పరుగులెత్తిన ఈమె / సగం రాత్రి వేళ పారిజాతమై పరిమళిస్తుంది' ఈ కవిత చదవగానే గుండె కలుక్కు మంటుంది. అది ఉదాత్త కోణంలో కవి చూపించిన ఆమె 'రెండో పాత్ర'.! విభిన్న కవితాంశాలకి కొన్ని ఉదాహరణలు 'గొడుగు', 'అక్కా-చెల్లి', ' నేల కురిసిన వాన', ' తదనంతరం'.. ప్రతి కవితనీ ఉదహరించవచ్చు. కవి చూసే విభిన్న కోణాలని సరికొత్త పదచిత్రాలతో నింపడం కూడా కవిత ప్రియులకి విందు భోజనంలా అనిపిస్తుంది ఈ పుస్తకంలోని ఏ కవిత చదివినా. 'నల్లటి తివాచీ లాంటి రోడ్డు', ' ముడి పెట్టిన శిరోజాల్లాంటి ఆలోచనలు','రాత్రి మరచి వెళ్ళిన వెన్నెల','పచ్చికలో పల్లేరులు','ఋతు బలహీనత','మాటల మల్లెచెట్టు'.. ప్రతి కవితా ఒక సరికొత్త భావజగత్తులోకి మనసుని నడిపిస్తుంది. ఆ  భావజగత్తు కలిగించే ప్రభావం నుంచీ బయటపడడం ఏ కవితా హృదయానికైనా చాలా కష్టమైన పని. ఏ కవిత ఒక్కసారి చదివి మరిచిపోయేది కాదు. ఎన్ని సార్లు చదివినా, ఎక్కడ నుంచీ చదివినా మనసు ఆర్ద్రమౌతుంది. ఆలోచలనలు కెరటాలౌతయి. 'పరిత్యాగి కావడానికి / వదులుకోవలసిందేమీ లేదు / సంసారికే సర్దుబాటు కావాలి' , 'పనిభారం కంటె / చెయ్యని పనుల బరువే ఎక్కువ', 'దూరం వెళ్ళే కొద్దీ / దూరపు బంధుత్వాలు కూడా / దగ్గరగా తోస్తాయి'.. ఎన్ని చరణాలైనా పునశ్చరణ చేసుకోవచ్చు. వెల్చేరు నారాయణ రావు గారు చెప్పినట్లు ' ప్రతి పద్యం ఇస్త్రీ చేసిన చొక్కాలా అమరికగా ఉంటుంది. నెమ్మదిగా తొడుక్కోండి. రెండోసారి చదివేప్పుడు మడత పెట్టిన కండువాల అందంగా ఉంటుంది. ప్రతి మడతా నెమ్మదిగా తీసి చూడండి'..మిమ్మల్ని పలకరించిన ప్రతి కవితనీ మీరు పలవరిస్తారు. విన్నకోట రవిశంకర్‌గారి  కవితలు చదవడం ఒక అందమైన, సున్నితమైన అనుభూతి.!  ***




*Inquiries*

***Prometheus Books***
***59 John Glenn Drive***
***Amherst, New York 14228-2119***
***(716) 691-0133***
***www.PROMETHEUSBOOKS.COM***

**తెలుగు పత్రికా రంగంలో** తనదైన ముద్ర వేసి, అసలైన జర్నలిజం ఎలా ఉండాలో ఆచరించి, నిరూపించిన నార్ల వెంకటేశ్వరరావు గారు వ్రాసిన సంచలనాత్మక  విశ్లేషణల సంపుటి ఈ గ్రంథం. వేదాలు, ఉపనిషత్తులతో పాటుగా హిందువులు తమ పవిత్ర గ్రంథంగా భావించే భగవద్గీతని సహేతుకంగా విశ్లేషించిన సవిమర్శక పరిశీలన ఈ పుస్తకం. వర్ణవ్యవస్థని పెంచి పోషించిన హిందూ మతం ప్రకృతిలోని ప్రతి వస్తువులోనూ భగవంతుడ్ని చూడమని చెప్పింది కానీ తోటి మనిషిని మాత్రం మనిషిగా కాక శూద్రుడిగా తర్వాత అంటరాని వాడిగా ముద్రవేసింది. అలాంటి సమయంలో వర్ణవ్యవస్థని ఖండిస్తూ, హేతుబద్ధమైన ఆలోచనతో జీవన మార్గాన్ని ఎన్నుకోమని చెప్పిన బుద్ధుని బోధనలు హిందూ మతానికి సవాలుగా నిలిచాయి. బ్రాహ్మణుల అధికారం ప్రశ్నార్థకమైంది. అలాంటి సమయంలో బుద్ధుని బోధనల నుంచి ప్రజల దృష్టిని మళ్ళించడానికి హిందూ మతాన్ని సమర్థించే వాళ్ళు ప్రవేశపెట్టిన గ్రంథమే భగవద్గీత అంటారు ఈ పుస్తకం ముందు మాటలో నరిశెట్టి ఇన్నయ్య గారు. మానవతావాది, జీవితాంతం తను నమ్మిన సత్యాలకోసం నిలిచిన నార్ల వెంకటేశ్వర రావుగారు భవద్గీతలోని బోలు తనాన్ని సూటిగా ప్రశిస్తారు ఈ పుస్తకంలో. కురుక్షేత్ర యుద్ధం ఎక్కడ జరిగింది, ఎప్పుడు జరిగింది, కృష్ణుడెవరు, కృష్ణుడు దేవుడెలా అయ్యాడు, ఒక వ్యక్తిగా, రాజకీయవేత్తగా, దేవుడిగా కృష్ణుడిని చూడడంలో ఎదురయ్యే వైరుధ్యాలు, భవద్గీతని ఎవరు వ్రాశారు, ఎప్పుడు వ్రాశారు, ఇందులో అసలు ఆధ్యాత్మికత ఉందా, భవద్గీత బోధించే నీతి ఏమిటి, ఇది ఎందుకు ప్రవేశపెట్టబడింది...ఇత్యాది  అంశాలని సహేతుకంగా, గాఢంగా, నిశితంగా విశ్లేషించారు ఈ గ్రంథంలో. భగవద్గీత మూలం సంస్కృతం, సంస్కృతంలో ఒక్కో పదాన్ని రకరకాలుగా అన్వయించుకోవచ్చు. ఇందువల్ల భవద్గీతని ఎవరికి తోచిన రీతిలో వారు వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీకి, నాథూరాం గాడ్సేకి ఇద్దరికీ భవద్గీతే ఆదర్శం! భగవద్గీతని నమ్మేవారూ, నమ్మని వారూ అందరూ చదివి ఆలోచించవలసిన పుస్తకం ఇది.

. ***

# ప్రత్యేక పుస్తక పరిచయం

## జలంధర

Where do we belong?

A mother's cry continues

డాక్టరు ఉమా ఇయ్యుణ్ణిగారు ఆంగ్లంలో రాసిన పుస్తకం ఇది.. గమ్యం తెలియని మానసిక వ్యాధులతో బాధపడే బిడ్డలను కన్న తల్లి కన్నీటి గాథ ఇది.

సాధారణంగా సాహిత్యంలో సామూహిక దుఃఖాన్ని, బాధని గురించి వచ్చే రచనలు మేధాపరంగానో, విప్లవ పరంగానో లేదా ఏదో "ఇజం"కు సంబంధించిన సాహిత్యంగానో మనకు దర్శనమిస్తుంది.. వస్తుపరమైన ఆ రకమైన ఆకర్షణో, ఆ శక్తో లేనిది. ఈ పుస్తకాలను మామూలుగా పాఠకులు చదవరు... "అబ్బో, ఆ బాధ తట్టుకోలేమనో," !ఆ! చదివి మనం ఏం చెయ్యగలంలే..! జీవితంలో దుఃఖాలు చాలకా ఇట్లాంటి పుస్తకాలు చదవడం!?" అనో ఈ పేజీలు తిప్పడానికే భయపడతారు చాలామంది.. ఈ ఆలోచనలు అన్నీ దాటి చదవాలనుకున్నవారిని ఇవి చదివించవు... విషయం ఉన్నా లెకపోయినా ఆపకుండా చదివించగల సత్తా రచయితకు చాలా చాలా ముఖ్యం.. ఈ ఒక్క గుణం లేక పోవడం వలన చాలా చాలా మంచి విషయం కలిగిన పుస్తకాలు చాలా సకృత్తుగా చదవబడతాయి.

ఈ పుస్తకం చూడగానే "చాలా హెవీ సబ్జెక్ట్ రా భగవంతుడా!" అనిపించింది... స్నేహితురాలి పుస్తకం కాబట్టి చదవడం నా బాధ్యత అనిపించి ప్రారంభించాను..

తమాషాగా ఆపకుండా చదివించిన ఈ పుస్తకం నన్ను ఆశ్చర్యపరచింది. ఇంత హెవీ సబ్జెక్ట్ అనుకున్నది ఇందులో ఎంత గొప్ప విషయం ఉన్నదా అనిపించింది.. మంచి పుస్తకం రచయిత మీద గౌరవం ఇనుమడింపచేస్తుంది.. చాలా చాలా తక్కువసార్లు రచయిత టెక్నిక్, పాత్ర విశ్లేషణ, ముక్తాయింపులో ఆకర్షణ గుర్తువున్నట్లు, సబ్జెక్టు, దాని ప్రభావం గుర్తు ఉండవు.. చాలా




మంది ఊహా రచయితలు చాలా గొప్ప విషయాలను చెప్పాలని అద్భుతమైన ప్రయత్నం చేసినా, వారి టెక్నిక్, వేరు వల్ల విషయాన్ని మర్చిపోయి ఏం చదివించారు?! ఎంత బాగారాశారు?! అన్న వ్యాఖ్యానం విని - "నేను చెప్పిన విషయం ఏమిటి?

ఆలోచిస్తున్నారా?" అని దుఃఖాల స్వగతాలు చెప్పుకునే పరిస్థితి గొప్ప రచయితకు ఒకొక్కసారి వస్తుంది.

కానీ ఈ ........ ఈ పుస్తకం చదివిస్తుంది... ఆలోచింపచేస్తుంది.. అంతేకాదు విషయం మన వెంటపడుతుంది.. నా సంగతేమిటి? అని నడకరాని పాపాయి కాలికి అడ్డం పడుతున్నట్లు నిలబెడుతుంది ఈ పుస్తకం మొదటి భాగం.. I want my son back

ఇందులో తల్లి కథ చెబుతుంది ఆమె పేరు ఆనా. ఒక ఉదాత్తుడు, మంచి భర్త మంచి తండ్రి అయిన ఒక న్యూరో సర్జన్ భార్య ఆమె.. ఉద్యోగం చేస్తుంది వాళ్ళకు ఇద్దరు మొగపిల్లలు. కేవిన్, ఆండ్రూ.. చాలా అందంగా, దృష్టి తగిలేటంత ఆనందంగా ఉన్న ఆ సంసారంలో ఉన్నట్లుండి ఒకరోజు..

ఏదో చిన్న అనారోగ్యంతో హాస్పిటల్‌కు తీసుకువెళ్ళిన కెవిన్.. డ్రగ్స్ ఉపయోగించాడేమో అన్న డాక్టర్ల అనుమానానికి ఆ తల్లి భద్రకాళీ అవుతుంది.. అందరి తల్లులలాగనే నా పెంపకం, మా వంశం అన్న ఇగోతో అందరినీ ఛాలెంజ్ చేస్తుంది.. విధి డినైయల్ తెరలను చించి మనకు నిజాలు చూపించంది నిద్రపోదుగా... ఇంక అక్కడనుంచి, స్కిజియోఫీనియా పేషేంట్ అయిన కెవిన్ తల్లిగా పిల్లలే మమేకంగా భావించే సగటు తల్లులలాగా తన కష్టం, తన దుఃఖం, తన బాధ అందరికీ అర్థంకాదేం అని తల్లడిల్లిపోతుంది.. సంఘంలోకి, తోటి స్నేహితులతో కలవడానికి భయపడుతుంది, సిగ్గుపడుతుంది.. "ఇంత బాధ కొంపలో ఉంటే, ఈ మనిషికి నిమ్మకు నీరెత్తినట్లుంటాడేం?" అని గాంభీర్యంగా తన పని తను చేసుకుపోతూ ఏ మాత్రం చెలించని భర్త వ్యక్తిత్వం చూసి కోపం తెచ్చుకుంటుంది. ఒకొక్కసారి ఆశ్చర్యపోయి మెచ్చుకుంటుంది. "కానీ, నేను అలా ఉండలేకపోయానేమిటి? కుటుంబం పట్ల నా దృక్పధమా? ఇలాగే ఉండాలనుకున్న నాకండిషనింగా?" అని తపన పడుతుంది.. అన్నగారు, చిన్ననాటి స్నేహితుడు, చిన్న కొడుకు ఆండ్రూ.. అందరూ నీ ఆరోగ్యం జాగ్రత్త, నువ్వు బాగుంటే అందరూ బాగుంటారు... అని ప్రేమతో హెచ్చరిస్తారు.. కానీ, ఆనా డిప్రెషన్‌లోకి జారిపోతూనే ఉంటుంది.. పిల్లలు, సంసారం ఇవి తప్ప మరొక ప్రపంచం లేని తల్లికి జీవితంలో మరి ఏది ఇన్స్పిరేషన్ ఇస్తుంది?! "నా గురించి నేను ఆలోచించుకోకుండా ఇలా బ్రతకడం ఒక తల్లి ఉండాలనుకోవడం తప్పా? నేరమా?" అంటుంది అనా.. ఈ ప్రశ్న ప్రతి తల్లి తనను తాను ప్రశ్నించుకోవాల్సిన అనుభవం ఎప్పుడో ఒకప్పుడు వస్తూనే ఉంటుంది..

ప్రేమలు ఎంత ఆర్థికపరమైనవో, సిట్యువేషన్స్ మన అభిమానలను, అభిప్రాయాలను ఎంత ఇన్‌ఫ్లుయన్స్ చేస్తాయో జీవితంలో చేదునిజాలు ఎన్ని ఉన్నాయో ఒక్కొక్క పేజీలో గుర్తుకు తెస్తారు రచయిత్రి.

గొప్ప న్యూరో సర్జన్ అయిన రాబర్ట్ తన వృతిని, ఉనికిని విపరీతంగా గౌరవించుకునే వ్యక్తి పిల్లవాడి కోసరం ఎన్నో త్యాగాలు చేస్తాడు... ఈ పరిస్థితుల్లో రెండవ కొడుకు యాన్డ్రూ ఎన్నో ఇబ్బందులు పడినా, చెప్పడు. ఒకటి రెండు సంఘటన్లలో తప్ప బైటపడడు.. వయస్సుకు మించి ఎదిగిపోతాడు..

తల్లికి అది అర్థమౌతూనే ఉంటుంది.. కెవిన్‌ను ఒక హాస్టల్ నుంచి ఒక హోమ్, మరొక హోమ్‌కు మారుస్తున్నప్పుడల్లా విలవిలలాడుతుంది.. "నేనేమడిగాను? నా బిడ్డకు కాస్త శుభ్రమైన వాతావరణమే కదా?" అనుకుంటుంది. మెడికేర్ మెంటల్ హెల్త్ బిల్లులు ఇవ్వరన్నప్పుడూ మొదట్లో పౌరుషంగా "మేమే పే చేస్తాము.. మా బిడ్డకన్న ముఖ్యమా?" అంటూ కానీ, సంవత్సరాలు దాటగానే ఆర్థిక సత్యాలు నిలదీస్తాయి. అంత అడ్వాన్స్డ్ కంట్రీ అమెరికాలోనే మెంటల్ హెల్త్‌కు ఇన్స్యూరెన్స్ లేకపోతే, థర్డ్ వరల్డ్ కంట్రీస్ గతేమిటట?!

సంసారంలో ఒక సమస్య మమకారబంధంతో భార్యాభర్తల మధ్య రొమాన్స్ చంపేస్తుంది... అందం, ఆనందం, ఆలోచన తగ్గిపోతాయి ఆనాకు. సుఖంగా ఉన్నవాళ్ళను చూస్తే అసూయలాంటిది కలుగుతుంది.. "నా బిడ్డకే ఎందుకలా?" అని పదే పదే అడుగుతుంది..

తనలాంటి వాళ్ళు ఎంతమంది ఓదార్పు లేక, బాధపడుతున్నారో అని ఆలోచించడం ప్రారంభిస్తుంది.. రెండవ భాగం వేర్ వియ్ బిలాంగ్? రెండవ భాగంలో పాత్రల స్వగతాలు,

వారి ఆలోచనా కోణాలు చిత్రీకరించారు రచయిత్రి... ఎవరి బాధ వారిదే..

ఆఖరి పేజీల్లో... "అనా! మనం మన లిమిట్ దాటి చెయ్యగలిగింది చేశాం.. ఇంక కెవిన్ బాధ్యత స్టేట్‌దే.." అని భర్త అన్నప్పుడు ఎంత నిస్సహాయతతో నిస్పృహలో నిలబడిపోతుంది అనా...

కెవిన్ లాంటి వారి గమ్యం ఏమిటి?

నిస్సహాయులైన తల్లుల దుఃఖానికి అంతం లేదా?!

ఉమగారు గొప్ప మనిషి. అందుకే నిజంగా జరిగిన కథను తీసుకుని హృద్యమంగా చిత్రీకరించి ఆలోచించమని పాఠకులను అభ్యర్థించారు, హెచ్చరించారు, నిద్రపోవద్దన్నారు... నా స్నేహితురాలు ఉమగారి మీద అభిమానం గౌరవంగా మారింది.

ఆదర్శ కుటుంబాలుగా బ్రతకాలనుకునే ఎంతమంది పిల్లల వలన ఛాలెంజ్ లు ఎదుర్కొంటున్నారు..? అన్ కండిషనల్‌గా పిల్లల్ని ప్రేమించి ఎంత కృతఘ్నత, ఎంత దుఃఖం, ఎంత ఆత్మనూన్యత పొందుతున్నారు?! వీరు చేస్తున్న తప్పేమిటి?!

ఏది నిజమైన ఒప్పో తెలిసేలోపల ఒక తరం పిల్లల్ని కనకుండా ఉంటే సుఖపడతారేమో.. మన దేశంలో నూరుకోట్ల జనాభా ఎలా పెరుగుతున్నారో, తెలియకుండా మరింత రెట్టింపు చెయడం అవసరమా?!

ఈ ఆలోచనలన్నీ మనను తట్టిలేపుతాయి ఈ పుస్తకం మనను చాలా రోజులు నిద్రపోనీయదు.. ఆరోగ్యకరంగా ఆలోచించమంటుంది...

ఉమగారు Mothers cry అన్న web site ప్రారంభించారు. దుఃఖం పంచుకోవడానికి, ఆలోచనలు బైటకు చెప్పడానికి భయపడేవారికి ఇది ఒక ఆప్యాయతల వితర్దిక..

ప్రతి ఒక్కరూ ఈ పుస్తకం చదవాలి.. ప్రతీ అన్‌కండిషనల్‌గా ప్రేమించే తల్లి, తన ఆలోచనలను ఎక్కడ ఆపాలో, తను ఒక పేషేంట్ గా ఎందుకు తయారవకూడదో, పిల్లలమీద ప్రేమతో తన ఉనికిని జీవితాన్ని సంపూర్ణంగా ఎందుకు దగ్ధం చేసుకోకూడదో, బాధ్యతలు ఎక్కడ అంతమౌతాయో తెలియచెప్పే మంచి నవల ఇది. ప్రతి ఒక్కరి ఇంట్లో ఉండవలసిన పుస్తకం. ఇది తెలుగులో కూడా రాయమని ఉమగారికి నా అభ్యర్థన.

****

ఈ పుస్తకం గురించిన మరిన్ని వివరాల కోసం సందర్శించండి

**www.motherscry.net**

ఇండియాలో ఈ పుస్తకం దొరికే చోటు

M/s S.G.E.Netsu Pvt.Ltd
2-2-23-22-19 ; D.D.Colony
Bagh Amberpet
Hyderabad - 500013




***Published by :***
***VB Raju Social Health Foundation***
***'Sravana' 2-2-19/1 D.D.Colony***
***HYDERABAD – 500 007***
***ProjectNishedh@gmail.com***

**మారినకాలంలో** సాంఘిక విలువలకి అర్థాలు మారుతున్నాయి. ఒకప్పుడు మద్యపానం అనేది కొన్ని వర్గాలకే పరిమితమైతే ఆధునిక సమాజంలో ముఖ్యంగా భారతదేశంలో మద్యపానం అనేది చాలా సామాన్యమైపోయింది. ప్రతి నగరంలోనూ లెక్కకు మించి పెరిగిపోయిన పబ్‌లు, జీవనశైలిలో వచ్చిన మార్పులూ కూడా మద్యపానం తప్పుకాదు అనే పరిస్థితి కలిపిస్తున్నాయి. ఆడా, మగా, పెద్దలూ, యువకులూ.. మద్యపానం అనే అలవాటుకి హద్దులు చెరిగిపోయాయి. ఐతే ఆల్కహాలిజం అనేది సోషల్ స్టేటస్ లేదా ఖరీదైన అలవాటు కాదు. అదొక జబ్బు. ఈ దురలవాటుకి లొంగిపోయిన వ్యక్తుల జీవితాలని కూలంకషంగా, పరిశీలిస్తే ఈ విషయం బోధపడుతుంది. ఆల్కహాలిక్‌లు తమ చెడ్డ అలవాటు ప్రభావాలని తమ కుటుంబ సభ్యులకీ, తద్వారా సమాజానికీ కూడా వ్యాపింపచేస్తారు. ముఖ్యంగా తాగుబోతుల పిల్లల మీద కలిగే ప్రభావం అత్యంత ప్రమాదకరమైనది, ఎందుకంటే పిల్లలు తరువాతి తరాల ప్రతినిధులు, ఒక బాల్యం దెబ్బతింటే ఒక తరం దెబ్బతిన్నట్లే. ఈ విషయాలని సకారణంగా వివరిస్తూ, ఈ సమస్యని అన్ని కోణాలనుంచీ విశ్లేషించి పరిష్కారమార్గాలను కూడా చూపించే సత్సంకల్పమే ఈ పుస్తకం వెనుకనున్న ఆశయం. తెలుగులో ఇటువంటి పుస్తకం ఇంతవరకూ రాలేదని చెప్పుకోవచ్చు. ఎవరు చూసినా ఆల్కహలిక్‌లను బాగు చేయడం గురించి చెప్పారు కానీ వాళ్ళ వల్ల పిల్లలు తమకి తెలీకుండానే ఎలా ఆత్మన్యూనతా భావం లాంటి ఆవాంఛనీయ లక్షణాలకి ఎలా బలైపోతారో ఎవరూ ఇంతవరకూ విశ్లేసించలేదు. ఈ ప్రయత్నం చేసిన రచయిత్రి శ్రీదేవీ మురళీధర్ గారిని అభినందించి తీరాలి. ఆల్కహాలిజం నిర్వచనంతో మొదలుపెట్టి, దాని ప్రభావాలను ముఖ్యంగా పిల్లలపై కలిగే దుష్పరిణామాలని విశ్లేషించి, చివరగా వాటిని ఎలా పరిష్కరించాలో కూడా చెప్పారు. పుస్తకం చివరలో ఆంధ్రప్రదేశ్‌లోని డ్రగ్ డి-ఎడిక్షన్ సెంటర్ల వివరాలని కూడా పొందుపరిచారు. అత్యంత విలువైన సాంఘిక బాధ్యతతో వ్రాయబడిన ఈ పుస్తకాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్న శ్రీదేవిగారికి ఎన్ని కృతజ్ఞతలు చెప్పినా సరిపోదు. బాలిగారి బొమ్మలు, సరళమైన, కథాగమనంలా సాగే వ్యాసాలూ ఈ పుస్తకాన్ని అత్యంత ఆసక్తికరంగా తీర్చిదిద్దాయి. మనం చదవడమే కాదు, పదిమందికీ చెప్పి చదివించాల్సిన పుస్తకం ఈ 'ఆవిష్కరణ'. ***




**అమెరికా** సందర్శించిన ఆంధ్రులు వ్రాసిన పుస్తకాలు ఎక్కువగా ట్రావెలోగ్స్ రూపంలోనే ఉంటున్నాయి. ఒకటి అరా కవితలు కూడా ఉండొచ్చు. అమెరికా అందాలని పూర్తి కవితాత్మకంగా , 70 పైగా ఖండికలలో చూపించిన పుస్తకం ఇదేనేమో. ఈ ఖండికల నడకచూస్తే వచనలో వ్రాసిన వాక్యాల్లా అనిపిస్తుంది. పదాల సొగసులని గమనిస్తే కవితాత్మకంగా సాగుతాయి. అందుకే విలక్షణమైన ఖండికల సమాహారం ఈ పుస్తకం. ముందు మాటవ్రాసిన ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు గారు " అది కవిత్వమా మరొకటా అనేదాని కంటే ఒక గృహిణిగా అనేకానేక కుటుంబ బాధ్యతలని నిర్వర్తిస్తూ, అక్షర పుష్పాలను మాలకట్టి ఆ పరిమళాలను పదుగురికీ పంచాలనుకోవడం విశేషమే కదా.." అని వ్రాశారు. ఈ కోణంలో చూస్తే రచయిత్రి గారి అభిరుచిని అభినందించి తీరాలి. అమెరికాలోని మంచు కురిసే వేళల అందాలని 10-15 ఖండికలలో వర్ణించారు. ప్రతి ఒక్కటి భిన్నంగా ఉండి, ఒక్కోటీ ఒక్కో అందాన్ని కనుల ముందు ఉంచుతుంది. అమెరికాలోని ప్రదేశాల గురించి, అమెరికాలోని తెలుగు వారి గురించి కూడా కొన్ని ఖండికలు ఉన్నాయి. "నిర్జీవమైన కళాహీనమైన ముళ్ళకంపలైన ప్రకృతిపై / జాలిగొని గగన విరహంలో రగిలే తారలన్ని / వెలుగు జిలుగు పువ్వులై విరిసే తారలమ్మల్లా / మెరిసే పొదలై సౌందర్య స్వప్నమై.." ఇలా ప్రతి ఖండికా వినూత్నంగా పరిమళిస్తూ  సాగుతుంది ఈ "అమెరికా అందాల గంధాలు` పుస్తకంలో.

. ***

*Smt. Korupolu Kalavathi*
*C/O K.R.Nayudugaru Kalanilayam*
*D.No. 2-52, Kamakshinagar*
*VIJAYANAGARM*
*08922-271064*




***గోపరాజు రాధాకృష్ణ***
***మోరి - 533 250***
***తూర్పుగోదావరి జిల్లా***
***ఫోన్: 99488 23500***

**డిజిటల్‌యుగం ప్రారంభంకాక పూర్వం** ఆల్బమ్ అంటే ఫోటో ఆల్బమే గుర్తుకొచ్చేది, గుర్తుండేది. ఇప్పుడు మ్యూజిక్ ఆల్బమ్‌లు, వీడియో ఆల్బమ్‌లు..రకరకాలు రావడం ఓ కొత్త పరిణామం అనుకోండి. సంకలనం ఏదైనా ఆల్బమ్ అంటే జ్ఞాపకాల సంచయం. ఆల్బమ్ తెరిస్తే మనకి మనం, మనతో నడిచిన జనం, గతంలోని మన పాదముద్రల జాడలు, మన కళ్ళు విహరించిన దృశ్యసంకలనం..అన్ని కనిపిస్తాయి. కవి గోపరాజు రాధాకృష్ణ గారు తన వినూత్న కవితా సంపుటికి 'ఆల్బమ్' అని పేరు పెట్టడంలోనే తనలోని భావుకతని పాఠకులకి రుచి చూపించారు.. మూడు పంక్తులతో హైకూలని పోలిన ఈ 'సదృశ కవితలు' తమ పేరుని సార్ధకం చేసుకున్నాయి. ప్రతి మూడు పంక్తుల కవితలోనూ ఒక సుందరమైన దృశ్యమో, భావమో, అనుభూతో పొదిగి ఉంటుంది.. మన ఆలోచనలని 'ట్రిగ్గర్' చేసి వదులుతుంది. మొట్ట మొదటిదే 'కొండవాలు / మబ్బు నీడకి / జారుడుబల్ల'. పాఠకుడు ఊహలకి రెక్కలు తొడిగితే ఈ మూడు లైన్లలోనూ కాలవల్సినంత కవిత్వం ఉంది. మబ్బు కాదు, దాని నీడ జారుతోంది. పిల్లలు జారడానికి జారుడుబల్లని ఉపయోగిస్తారు. ఇక్కడ మబ్బు నీడ జారడానికి కొండవాలు ఉపయోగపడుతోంది. ఒక్క సారి కళ్ళముందు కొండవాలు మీదుగా మెలమెల్లగా కదులుతున్న నీలిమేఘ ఛాయలు కనిపిస్తే- అది చాలదూ.. ఈ సదృశ కవిత సార్థకమవడానికి..!? అర్థం చేసుకోవడానికి, అనుభూతించడానికి ప్రతి కవితనీ ఇంతగా విశ్లేషించనవసరం లేదు. ఒక్కసారి పుస్తకం తెరిచి కళ్ళతో బాటు మనసుని కూడా ఈ పంక్తుల వెంట పరుగులు తీయిస్తే ఆ మాధుర్యం మనసుపొరల్లోకి ఇంకుతుంది. 'తను నేనూ ఉన్నా / ఇద్దరికీ / ఒంటరి తనమే','రెండు రెప్పల / ఆలింగనం / కల్లోకి నీకు ఆహ్వానం','పెదవి దాటని మాట / కళ్ళని / సాయమడిగింది..','నాలో నువ్వు / నీలో నేను / మనతో ప్రేమ' ..ఇంత సున్నితమైన ప్రేమకవితలని వ్రాసి రచయిత రాధాకృష్ణ గారు 'ఆల్బమ్' పేరుని సార్థకం చేశారు. ఈ పుస్తకానికి హైలైట్ అనిపించిన మెరుపు - అంకిత వాక్యం.." జీవితంలోకి / ఇంకి పోయిన జ్ఞాపకం / నాన్నగారు..".. కవిత్వంకోసమే కాదు ఒక్కసారి సున్నితమైన భావ, పద స్పర్శలతో మనసు మూలలని పులకింపచేసుకోవాలనుకునే వారందరూ చదవాల్సిన వినూత్న 'సదృశ కవితా సంపుటి' ఈ ఆల్బమ్. ఇంతచక్కటి భావాలని గుదిగ్గుచ్చి అందించిన గోపరాజు రాధాకృష్ణ గారు అభినందనీయులు. ***




**సూరంపూడి విశ్వంగా** తెలుగు పాఠకులకి పరిచయమున్న సూరంపూడి విశ్వేశ్వరరావు గారు వ్రాసిన పేరడీలు, హాస్యకథల సమాహారం  ఈ పుస్తకం. తణుకు వాస్తవ్యులైన విశ్వంగారు గత రెండు దశాబ్దాలుగా వివిధ హాస్య, వార , మాస పత్రికల్లో వ్రాసిన  హాస్య రచనలు ఈ పుస్తకంలో చోటుచేసుకున్నాయి. రంగస్థల ప్రదర్శనల్లో మిమిక్రీ రూపంలో పేరడీలు ప్రదర్శించడం తెలికేమో కానీ రచనల్లో పేరడీలు సృష్టించడానికి, వివిధ రచయితల శైలులపట్ల నిశితమైన పరిశీలనా దృక్పథం ఉండాలి. అంతేకాక ఆయా రచయితల రచనల్లో వాళ్ళ ముద్ర కలిగిన అంశాలేమిటో పట్టుకోగలిగి ఉండాలి. సూరంపూడి విశ్వంగారు ఈ దిశగా మంచి కృషి చేశారు. అందుకే సి.నా.రె. పురాణం, విశ్వనాథ సత్యన్నారాయణ, రావి శాస్త్రిగారి లాంటి ప్రసిద్ధ రచయితల రచనలని అనుకరిస్తూ రచించిన పేరడీల్లో తగినంత హాస్యాన్ని పలికించగలిగారు. కేవలం రచయితలేకాక సమాజంలో మనకి నిత్యం ఎదురుపడే డాక్టరు, న్యాయవాది, కార్మిక నాయకుడు లాంటి విలక్షణ పాత్రలని తీసుకుని వారి వృత్తిపరమైన పదాలలో మాట్లాడిస్తూ చక్కటి హాస్యాన్ని పండించిన పేరడీలు కూడా విశ్వం గారికి హాస్యం మీదకల పట్టుని సూచిస్తాయి. అలాగే మధ్యతరగతి జీవితాల్లో తటస్థించే చిన్న చిన్న సమస్యలని, సంఘటనలని హాస్యకథలుగా మలచిన విధానం కూడా ప్రశంసనీయంగా ఉంది. ముందు మాటలో ప్రముఖ రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తి గారు చెప్పినట్లు విశ్వంగారి రచనల్లో చదివించే గుణం పుష్కలంగా ఉంది. ‘ఎక్కడా విసుగుపుట్టని విధంగా పదాల ఎంపిక, వాక్యనిర్మాణం, సూటితనం శ్రీ విశ్వం శైలిలో సంతరించుకోవడంతో ఆయన కథలు పాఠకులని తమతో ఆసక్తిగా తీసుకెళ్తాయి‘. ఈ పుస్తకంలోని రచనలన్ని ఆరోగ్యకరమైన కాలక్షేపాన్నిస్తాయి.

***

*For Copies:*

***Surampudi Viswam,***
***N.S.C Bose Road***
***TANUKU – 534 211***
***Phone: 228324***




**_Published by :_**
**_C.Subba Rao_**
**_118 – Kamala Nagar_**
**_Vanasthaliouram, Hyderabad- 500 070_**
**_Cell: 998 923 4505_**

**చాలా సంవత్సరాలు** ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేసిన శ్రీ సి.వి.సుబ్బారావు గారి రేడియో ప్రసంగాలు, వివిధ పత్రికలలో వ్రాసినా వ్యాసాలు, ఇంకా కొన్ని తిలక్ కవితల ఆంగ్లానువాదం, ఒక ఇంగ్లీష్  ఏకాంకిక - వీటి సంపుటి ఈ ఆంగ్ల గ్రంధం. సుబ్బారావు గారి సాహితీ కృషి కేవలం ఆంగ్ల కవుల కవితా విశ్లేషణతో ఆగిపోక, భారతీయ కవుల్ని, తెలుగు లోని ఆధునిక, ప్రాచీన కవుల్నీ కూడా సునిశితంగా పరిశీలించడం వరకూ సాగింది. ఈ పుస్తకంలోని ఏ వ్యాసం చదువుతున్నా కమ్మటి కవిత్వం చదివిన అనుభూతి కలుగుతుంది. రచయితకి ఇంగ్లీషు భాష మీద ఉన్న పట్టు అలాంటిది. వర్డ్సువర్త్, మిల్టన్, కీట్స్..లాంటి పాశ్చాత్యకవుల కవిత్వాన్నీ, సరోజినీ నాయుడు, టాగోర్ లాంటి భారతీయాంగ్ల కవుల సాహితీ కృషినీ, విశ్వనాథ సత్యనారాయణ గారి లాంటి సాంప్రదాయ కవుల సాహితీ సౌరభాలనీ, తిలక్ లాంటి ఆధునిక కవుల వచనకవితా రీతులనీ ఆసక్తికరంగా విశ్లేషించారు. ఈ వ్యాసాలని విమర్శనాత్మక వ్యాసాలు అనే కంటే విశ్లేషణాత్మక వ్యాసాలు అంటేనే బావుటుంది. కేవలం కవినీ, కవిత్వాన్ని పొగడ్డమో, లోపాలని ఎత్తిచూపడమో కాక, కవి వ్రాసిన కవితాఖండికలని కూలంకషంగా తనవైన కొన్ని సొంత భావాల ప్రాతిపదికగా విశ్లేషించడంలో సుబ్బారావు గారు నూటికి నూరుశాతం విజయం సాధించారు. ఆయన తిలక్ కవితలకి చేసిన ఆంగ్లానువాదాన్ని చదివినప్పుడూ, 'త్రివేణి' రామకోటేశ్వరరావు గారితో తనకున్న పరిచయం గురించి వ్రాసిన కథనాన్ని చదువుతున్నప్పుడూ..సుబ్బారావు గారు తన రచనా ప్రక్రియని కేవలం విశ్లేషణకే పరిమితం చేయకుండా సొంతంగా సృజనాత్మక రచనలు చేసి ఉంటే గొప్ప పేరు తెచ్చుకునే వారనిపిస్తుంది. ఆధునిక ఆంగ్ల సాహిత్యంలో నైతిక విలువలు, ఆధునిక విద్యావిధానంలోని పరిమితులు, రచయితగా నెహ్రూ లాంటి వ్యాసాలు ఈ పుస్తకానికి ఒక ప్రత్యేకతని ఆపాదించాయి. అలానే ఎక్కువమందికి తెలియని రాజారావు గారి ఇంగ్లీషు నవలల్లోని భారతీయత లాంటి వ్యాసాలు ఎన్నో కొత్తవిషయాలని చెబుతాయి. అరుదైన తెలుగు సాహిత్యలోకపు ఔన్నత్యాలని తెలుగు రాని వారికి అందించే క్రమంలో కూడా ఈ పుస్తకం బాగా ఉపయోగపడుతుంది. ఇంత చక్కటి వ్యాసాలని పుస్తక రూపంలో తీసుకొచ్చి అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చిన రచయిత శ్రీ సుబ్బారావు గారిని  అభినందించాలి. ***




**'తపతి', 'శివాని', 'నయన', 'కచిత'** కలం పేర్లతో కవిత్వం వ్రాసిన నట్టి శివపార్వతి గారు వ్రాసిన విలక్షణమైన నవల ఈ 'పదహారేళ్ళ పల్లవిలో..' దీన్ని నవల అనే కంటే 16 కథల లేదా గల్పికల సంపుటి అంటే బావుంటుందేమో. ఒక అనాధశరణాలయం బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథ ఇది. ఐతే 16 అధ్యాయాలు వేటికవే విడిగా కూడా ఉంటాయి. అనాధ శరణాలయంలో పెరిగే 16మంది అమ్మాయిలు, వాళ్ళు ఇష్టపడిన కళారంగంలో కృషిచేసి, పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవడం అనేది 16 కథలకీ మూలసూత్రం. ఒక కథలోని ముఖ్యపాత్రని నిద్రలేపడంతో రెండో కథలోని ముఖ్యపాత్ర పాఠకుల ముందుకి వస్తుంది. ఆ విధంగా 16 మంది అమ్మాయిల కథలనీ ఒక పూలదండలా గుది గ్రుచ్చారు. ఒక విధంగా చూస్తే ఇదొక సరికొత్త ప్రయోగం. రచయిత్రి గారు ముందు మాటలో వ్రాసుకున్నట్లు 'పదహారు కళలలో తమ జీవిత గమనాన్ని సార్థకం చేసుకోవాలని ఆరాటపడే - పదహారు మంది అనాధ ప్రమదల అంతరాత్మల ఆశాకిరణాలకు అద్దం పడుతున్న నవల ఈ 'పదహారేళ్ళ పల్లవిలో..'. సుప్రభాత వేళల గురించి వ్రాసేప్పుడు రచయిత్రి వ్రాసిన వర్ణనలు వారిలోని కవితా హృదయానికి తార్కాణాలు. మొత్తానికి ఒక విలక్షణమైన శైలిలో, వినూత్నంగా సాగింది ఈ 'పదహారేళ్ళ పల్లవిలో..'.

***

*రచయిత్రి*
*ఎ-101, క్రిషి విహార్*
*7158, నాబార్డు క్వార్టర్సు, అమీర్ పేట*
*హైదరాబాదు - 500 016*
*ఫోన్: 2373 0154*




**నలభై సంవత్సరాల** క్రిందట మరువాడ రాజేశ్వరరావు గారు వ్రాసిన కథల సంకలనం ఈ పుస్తకం. అన్నేళ్ళ క్రిందట కథలన్న విషయం రచయిత చెబితేనూ, కొన్ని కొన్ని కథల్లో వచ్చిన డబ్బు ప్రసక్తినిబట్టీ (రూపాయలూ, పైసల విలువదృష్ట్యా ) తెలియాలే తప్ప, కథాంశాల విషయానికొస్తే ఇవన్నీ ఇటీవలే వ్రాసిన కథలన్నా నమ్మగలిగేట్లున్నాయి. ఎన్నుకున్న కథాంశాలు ఇప్పటి ఆంధ్రదేశంలోని మధ్య, దిగివతరగతి జీవితాలకి చాలావరకూ అన్వయిస్తాయి. కథా రచయితగా రాజేశ్వరరావుగారి విజయం ఈ కోణంలో పరిపూర్ణంగా కనిపిస్తుంది. 'కాలక్రమంలో నమ్మకాలూ, ఆలోచనలూ మారినా పేదవాళ్ళ పేదరికానికి వ్యవస్థ కారణమనీ, వ్యవస్థమారడం అవసరమనీ' రచయిత నుమ్ముతాడని పేర్కొన్నారు. రచయిత స్పృశించిన అధోజగత్ సహోదరుల జీవన విధానాల దృష్ట్యా మన వ్యవస్థలో పెద్ద మార్పులేం రాలేదు కాబట్టి ఈ కథలకీ ఇప్పటిరోజుల్లోనూ ఖచ్చితంగా విలువ ఉంటుంది. రచయిత తన స్వస్థలం (భీమునిపట్నం) వదిలేసి ఢిల్లీ, అమెరికాల్లో నివసించినప్పటి జీవనశైలి తనని కథలు వ్రాయడనికి ప్రేరేపించలేదని చెప్పారు. పరిసరాల్లోని సంఘర్షణ, కదిలించే జీవనచిత్రాలు దూరమవడమే ఇందుక్కారణం కావొచ్చు. ఈ కథల్లో సంక్లిష్టమైన వాక్యాలు, సుదీర్ఘమైన సమాసలూ, అర్థం కాని వాక్య నిర్మాణాలూ ఉండవు. రాజేశ్వరరావు కథల్లో శైలీ, సంఘటనలు అత్యంత సరళంగా ఉంటాయి. తన విశ్లేషణని అతి సులువైన పదాలలో చెప్పి, నిర్ణయాన్ని పాఠకులకే వదిలేస్తారు. ఇందువల్ల కూడా ఈ కథల్లో రచయిత నిజాయితీ, నిబద్ధత కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి. పిడకలు కొట్టుకునే గోడని ఆక్రమించిన వాణిజ్య ప్రకటనలు చూశాక 'ఆ గోడ స్వతంత్ర భారతదేశం లాగుంది' అంటారు. ఆ ఒక్క వాక్యం చాలు రచయిత చెప్పదలచుకున్నదేదో తెలుసుకోడానికి. 'జెండాలు చొక్కాలున్న వాళ్ళకే గాని చొక్కాల్లేని వాళ్ళకోసం కాదు..', 'గీత చెరిగిపోవాలంటే సంకెళ్ళు తెగిపోవాలి..'.. మంచి కథలు మళ్ళీ మళ్ళీ చదవాలనుకునే వాళ్ళు తప్పని సరిగా చదవాల్సిన పుస్తకం. మళ్ళీ 'కథలు రాసే దశ ముందు ముందు ఉందని నా నమ్మకం' అంటున్న రాజేశ్వరరావు గారి కలం నుంచీ సమకాలీన సమస్యలని ప్రతిబింబించే కథలు త్వరలో రావాలని ఆశిద్దాం. ***

**Published by :**
**Emesco Books**
**Suryarao Pet, VIJAYAWADA – 520 002**
**emescobooks@yahoo.com**




***Publishers:***
***PRITYA***
***70(New), Dr.Ranga Road, Mylapore***
***CHENNAI – 600 004***
***sukhamayu@pritya.com, wwww.pritya.com***

**యోగ పుంగవులు,** ఋషులూ, శాస్త్రవేత్తలు కూడా 'ప్రాణం'(లైఫ్) అనే భావాన్ని అనేక రకాలుగా నిర్వచించారు. ఐతే ఆయుర్వేదం చెప్పేదాని ప్రకారం 'ఆయు' అంటే ప్రాణం(లైఫ్) అనేది శరీరం, హృదయం, మెదడు, వీటి భావాలు.... అన్నింటి యొక్క సమగ్ర స్వరూపం. శరీరాన్ని, భావాలనీ ఒక క్రమ పద్ధతిలో ఉండేలా చూసుకుంటే మెదడు, హృదయం కూడా మన అధీనంలో ఉంటాయి. అలా జరిగినప్పుడు వ్యాధులూ, మానసిక సమస్యలూ మనకి దూరంగా ఉంటాయి. అలాంటి జీవితాన్నే 'సుఖమయ జీవితం' సుఖం - ఆయు అంటారు. అదే ఈ పుస్తకం పేరు. శరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుకోవాలంటే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి. మనం తినే తిండి మన ఆరోగ్య పరిస్థితిని నిర్ణయిస్తుందంటారు. వేదకాలం నుంచీ కూడా ఆయుర్వేదం ఒక శాస్త్రంగా వర్ధిల్లింది. అంత విలువైన ఆయుర్వేద విజ్ఞాన పరంగా విశ్లేషిస్తూ, సమగ్ర ఆరోగ్యానికి అవసరమైన వంటకాల గురించిన విశేషాలతో నిండి ఉందీ పుస్తకం. వివిధ కాయగూరలూ, వంట దినుసులూ వాటి గుణగణాలని సశాస్త్రీయంగా విశ్లేషించడం మెచ్చుకోదగ్గ విషయం. ఎనిమిది అధ్యాయాలుగ విభజించబడిన ఈ పుస్తకంలో ప్రతి అధ్యాయానికీ మొదట్లో వివిధ అంశాల గురించిన ఆయుర్వేద విశ్లేషణని ఆసక్తికరమైన శైలిలో వర్ణించారు. నేనెవరు? ప్రకృతికి మనిషికీ సంబంధం ఏమిటి? - పంచభూతాలు, వాటి ప్రత్యేకతలు, భోజనం యొక్క విశిష్టత, మెదడు మీద ఆహార ప్రభావం..ఇలా ఎంతో విలువైన సమాచారాన్ని పొందుపరిచారు. ఈ విశేషాలే ఈ పుస్తకాన్ని మిగతా వంటల పుస్తకాలకంటే భిన్నంగా నిలబెడతాయి. శాఖాహార కూరలు, పచ్చళ్ళు, సూపులు, తీపి పదార్థాలు, పప్పులు, చిరుతిళ్ళూ, పళ్ళ రసాలు...ఇలా 60 పైగావంటలని ఒక క్రమ పద్ధతిలో వర్ణించారు. ఒక్కో వంటకాన్నీ తయారు చేయడానికి అవసరమైన పదర్థాలూ, వాటి వల్ల ఉపయోగాలూ, తయారు చేసే విధానం..చాలా వివరంగా చెప్పారు. 100 కి పైగా పూర్తి రంగుల పేజీలు, నాణ్యమైన ముద్రణ ఈ పుస్తకాన్ని ఉపయోగకరంగానే కాక ఆకర్షణీయంగా కూడా తీర్చిదిద్దాయి. సశాస్త్రీయమైన ఆయుర్వేద పరిశోధనల ప్రాతిపదికగా ఈ పుస్తకాన్ని రూపొందించిన ప్రచురణ కర్తలు 'ప్రిత్య'ని, గ్రంధకర్తలు జిగ్యాస గిరి, ప్రతిభా జైన్ గార్లని అభినందించి తీరాలి. ***




**ఇంటర్నెట్‌తో పరిచయమున్న** ఎవరికైనా ర్యాండీ పాష్ అన్న పేరు తెలియకుండా ఉండదు. ఆయన కార్నెగీ మెల్లాన్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్. ఈయన మనసులోని మాటలకు అద్దం ఈ పుస్తకం. మామూలుగా చెప్పే మాటలు కాదు, తాను కొద్ది రోజుల్లో చనిపోతానని తెలిసిన వ్యక్తి చెప్పిన ‘మంచి మాటలు‘. ఈ లోకాన్ని విడిచివెళ్ళిపోవడం ఎప్పటికైనా తప్పదని అందరికీ తెలుసు. కానీ కొద్ది రోజుల్లో చనిపోతానని నిర్ధారణగా తెలిస్తే ఆ మనిషి మానసిక స్థితి ఎలా వుంటుంది? మామూలు మనుషుల సంగతేమో కాని ర్యాండీ పాష్ మాత్రం సాహసవంతమైన యోధుడిలా మృత్యువుతో పోరాడుతూనే తనకి జీవితం నేర్పిన పాఠాలని ‘లాస్ట్ లెక్చర్‘ పేరుతో అందరికీ అందించాడు. 1960లో జన్మించిన ర్యాండీకి 2006 సెప్టెంబర్‌లో కాలేయంలో కాన్సర్ అని నిర్ధారించారు. అక్కడ మొదలైంది అతడి అంతిమయాత్ర. 2008 జూలై 25న కాన్సర్ మహమ్మారికి లొంగిపోయి ఈ లోకం నుంచీ నిష్క్రమించాడు. ఆ రెండేళ్ళలో లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చాడు. ‘చిన్ననాటి కలల్ని సాకారం చేసుకోవడం ఎలా?‘ అని మొదలుపెట్టిన ప్రసంగ పరంపరకి, అతడి మరణానికి 4 నెలల ముందు పుస్తకరూపం వచ్చింది. కేవలం అమెరికాలోనే 4.5 మిలియన్ల కాపీలు అమ్ముడైన ఈ పుస్తకాన్ని ప్రపంచ వ్యాప్తంగా 46 భాషల్లోకి అనువాదం చేశారు. దీన్ని తెలుగులో అనువాదం చేసిన ప్రత్యేకత డాక్టర్ పోలంరెడ్డి శ్రీలక్ష్మి గారికి దక్కింది. హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలో చేసిన పరిశోధనకి గాను ‘ఉత్తమ పరిశోధనా గ్రంథం‘ పురస్కారాన్ని అందుకున్న శ్రీలక్ష్మిగారు, ఈ ‘ది లాస్ట్ లెక్చర్‘ అనే పుస్తకాన్ని అతి సరళమైన శైలిలో అనువాదం చేశారు. మూలానికి ఎక్కడా భంగం రాకుండా సూటిగా తెలుగులో వ్రాయబడిన పుస్తకాన్నే చదువుతున్నామన్న భావాన్ని కలిగించారు. రచయిత భావావేశానికి అనువాద వాక్యాలు ఏమాత్రం అడ్డంకిగా అనిపించవు. శ్రీలక్ష్మి గారి ఈ ప్రయత్నాన్ని అందరం అభినందించి తీరాలి. మృత్యువుకు లొంగిపోయిన ర్యాండీ నిజానికి మృత్యువును జయించాడు. చరమాంకంలో ఎంత స్ఫూర్తిదాయకంగా బ్రతకవచ్చో ఆచరించి చూపించాడు. ఆ భావావేశాన్ని తెలుసుకోడానికి, ర్యాండీ చెప్పిన జీవిత పాఠాలను అర్థం చేసుకుని స్ఫూర్తి పొందడానికి తప్పని సరిగా ఈ పుస్తకం చదవండి.

**

*Copies available at :*
*Navodaya Publications*
*Visalandhra Publications*
*Also directly from sreepr@gmail.com*




*Publishers:*
***Upstate Harbor Publishers***
***www.whpublisher.com***
***ISBN:978-0-615-28096-7***

**వెండితెరని తన అభినయంతో** ఏళ్ళ తరబడి సుసంపన్నం చేసిన మహానటి, తెలుగింటి ఆడపడుచు 'సావిత్రి' గురించిన సమగ్ర గ్రంథం ఈ పుస్తకం. ఆత్మకథ ఐతే ఎవరికివారు వ్రాసుకోవాలి. మరొకరి జీవిత చరిత్ర వ్రాయాలంటే ఆ వ్యక్తిగురించి ఆమూలాగ్రం పరిశోధించి, విశ్లేషించి వ్రాయాలి. మన మధ్యలేని మహానటి గురించి ఇలాంటి మహాగ్రంధాన్ని తీసుకురావాలనే ఆలోచనే ఒక ప్రత్యేకం ఐతే, దాన్ని సాధించడం ఒక యజ్ఞం. మహాయజ్ఞం లాంటి ఈ ప్రయత్నానికి ప్రతిరూపమే సావిత్రి గురించిన ఈ రిఫరెన్స్ పుస్తకం. కేవలం జీవితంలోని సంఘటనలని ఒక వరుసక్రమంలో వ్రాయడం కాకుండా 650 పేజీల ఈ ఉద్గ్రంథంలో సావిత్రి గారి జీవితాన్ని ప్రొఫెషనల్ థీసిస్ లాగా, పరిశీలన గ్రంథంలాగా చిత్రించారు. మొదటి 70-80 పేజీల్లో ఆమె జీవిత చరిత్రని వ్రాశాక మిగతా పేజీలనీ విశ్లేషణా ధోరణిలో కొనసాగిస్తూ, సావిత్రి గారి ప్రతిభని వివిధ కోణాల్లో పరిశీలించారు. ఆమె సినిమాల్లో ముఖ్యమైన వాటిలో సావిత్రి నటనని అతి సునిశితంగా పరిశీలించి గ్రంథస్థం చేయడం వెనుక రచయితలు చేసిన కృషిని అభినందించి తీరాలి. సావిత్రి వ్యక్తిత్వ విశ్లేషణని 15 విభాగాల్లో వర్ణించడం రచయితల సునిశిత పరిశీలనా దృష్టికి నిదర్శనం. ఇందులోని సమాచారాన్నంతటినీ సాధికారికంగా ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి సంపాదించారు రచయితలు. అరుదైన రిఫరెన్స్ పత్రాలు (సావిత్రి గారి జననం రిజిస్ట్రేషన్ పత్రం లాంటివి), ఫోటోలు, అత్యంత నాణ్యతతో కూడిన ముద్రణ కూడా ఈ పుస్తకాన్ని ప్రత్యేక స్థాయిలో నిలబెడతాయి. తెలుగు చలనచిత్ర మహానటి గురించి తెలుగురాని వారికి సైతం అందుబాటులో ఉండేలా ఇంగ్లీషులో వ్రాయడం ప్రయోజనాత్మకమైన ప్రయోగం. రచయితలు (పరిశోధకులు) మూర్తి గారు, సోమరాజు గారు అభినందనీయులు.

***




**Publishers :**

***రసధ్వని ప్రచురణలు***
***43-130-2, సుందరయ్య రోడ్డు***
***క్రొత్త సింగునగర్, విజయవాడ - 15***

**ప్రముఖ కవి** శ్రీ జొన్నవిత్తుల వ్రాసిన విలక్షణమైన కావ్యం ‘తెలుగువేదం‘. ప్రపంచంలోని ఏ భాష గురించీ ఇంత సమగ్రమైన కవితాత్మక గ్రంథం వెలువడలేదంటే అతిశయోక్తిలేదు. ఈ ‘తెలుగువేదం‘లో - తెలుగు అక్షరాల గురించి, తెలుగు భాష గురించి, తెలుగు జాతి గురించి, తెలుగు సంస్కృతి గురించిన సాహితీఝరి ఇంతవరకూ ఎవరూ స్పృశించనన్ని కవితా ప్రక్రియలలో సహస్ర ముఖాలుగా సాగింది. జొన్నవిత్తులగారు ఈ పుస్తకంలో కవిగా తన విశ్వరూపాన్ని చూపించారు. కవిత వస్తువులో వైవిధ్యం ఉంటే ఎన్ని పాటలు, పద్యాలు..వగైరా వ్రాయొచ్చు. కానీ ఈ పుస్తకంలోని కవితా వస్తువు ఒక్కటే ..అదే ‘తెలుగు‘! ఒక భాష జాతి సంస్కృతిలో ఎన్ని విధాలుగా మమేకమై ఉంటుందో అన్ని కోణాలలోనూ మనసుకి హత్తుకునేలా కవీత్వకరించిన తీరు అమోఘం, అద్వితీయం, అనుపమానం..!! తెలుగు అక్షరాలలో సరస్వతీదేవి సమగ్ర స్వరూపాన్ని దర్శించడం, తెలుగు గుడింతాలలో వివిధ వాయిద్యాలని చూడగలిగే రసానుభూతి.. ఇలాంటివన్నీ ఇంతవరకూ ఎవరూ చూడని భావుకతా కోణాలు. తెలుగు భాషని వివిధ ప్రాంతాల యాసలలో, వివిధ ప్రాంతాల జీవన విధానాలలో సందర్శించిన విధానం జొన్నవిత్తుల గారికే సాధ్యపడిందేమో! ప్రకృతిలోని అణువణువులో ‘తెలుగు‘ని చూడడమనేది ప్రశంసలకతీతమైన ప్రక్రియ. ‘తెలుగు భాష‘ గొప్పది అనడం కాదు, ఆ గొప్పదనాన్ని వివిధ కవితా ప్రక్రియలద్వారా నిరూపించడం కూడా జొన్నవిత్తులగారి ప్రత్యేకత. పద్యాలు, గేయాలు, అష్టకాలు, దండకాలు, ఇంగ్లీషులో పద్యాలు, ప్రయోగాత్మక పద్యాలు, రసాత్మకపద్యాలు.. కవి ఎన్నుకున్న కవితా ప్రక్రియల్లో ఇవి కొన్ని మాత్రమే. ఒకే అంశం గురించి వ్రాస్తూ కూడా ప్రక్రియ ఏదైనా భావుకతకి పెద్ద పీట వేయడం కూడా గమనించదగ్గ విషయం. "గంద్ర ఇసుక పక్క కడు మెత్తగా చేరి / మంచి తెల్పెడి ఒంద్రుమట్టి భాష", "ఏటీ నడుమా ఈదే ఏన్గా దంతం మీది ఎన్నెల తళుకే నా భాష", "పాపి కొండల్కాడ లేళ్ళమందల్లెక్క / పరిగెత్తే గోదారిరా / (తెలుగు)".. అడుగడుగునా పలకరించే అందమైన కవితా చిత్రాల్లో ఇవి కొన్ని మచ్చుతునకలు. ‘హంసపిట్ట‘,‘కృష్ణమూర్తి తెలివితేటల కోట‘,‘శివస్వామి‘, ‘కోతి కబురు‘.. అబ్బురపరిచే పదప్రయోగాల నిధి ఈ ‘తెలుగువేదం‘. తెలుగు వారందరూ చదవాల్సిన పుస్తకం, తరువాతి తరాలకి అందించాల్సిన పుస్తకం, తెలుగు తెలియని తెలుగువారు తెలుగు నేర్చుకుని చదవాల్సిన పుస్తకం...!!

***




**Copies at:**

**Plot-18, Little Heart Homes**
**Jeedimetla(V),HYDERABAD- 500 055**
**------------------------------------**
**Visalandhra Book House**
**Prajashakti book House**
**Navodaya Book House**
**Disa Pustaka Kendram**

**'ఏ హృదిలో నైనా** / ఒక చిన్ని జ్ఞాపకం / జీవితాంతం / వేలందుకుని / నడిపిస్తుంది' భావుకత నిండిన హృదయాలైతే ఆ జ్ఞాపకాలనే చిరకాలం గుర్తుంచుకోదగ్గ కవితలుగా మలుస్తాయి. అలాంటి కవితల మాలిక ఈ 'శీతసుమాలు' సంపుటి. రచయిత్రి డా.కె.గీత ఎంచుకున్న కవితా వస్తువులు ఎంత విభిన్నంగా, వైవిధ్యంగా, వినూత్నంగా ఉన్నాయో కవితా శైలి కూడ అంత అందంగానూ, హృదయంగమం గానూ ఉంది. చాలా మంది కవులు స్పృశించని ఎన్నో దృశ్యాలని తన కవితల్లో ప్రతిభావంతంగా  ప్రతిబింబింప చేశారు కవయిత్రి..

పాలు మాన్పించే అమ్మ ప్రయత్నం 'పాల రాతి  గుండె' లోనూ, విద్యా సంవత్సరం పరీక్షలు వ్రాసే విద్యార్థులు 'అగ్ని పరీక్ష'లోనూ, చెట్టుకొమ్మ ఉయ్యాలలో పాపాయి జీవితం 'చెట్టుకొమ్మ బాల్యం' లోనూ, అసలైన ఇంటికి నిర్వచనం 'ఇల్లు' లోనూ, బీదరికం ఆశ్రయించిన పశువుల అమ్మకం 'కడగండ్ల సాక్ష్యం' లోనూ, ..ఇలా అనేకానేక దృశ్యాలు భావ చిత్రాలై ప్రతి కవితలోనూ మనల్ని పలకరించడమే కాదు, మనసుల్ని సున్నితంగా తట్టి అక్కడ్నుంచీ కదలనంటాయి. కవితా శీర్షికల విషయంలోనూ రచయిత్రి చూపించిన వినూత్నత ప్రతి కవితనీ తీర్చి దిద్దడంలో రచయిత్రి తీసుకున్న శ్రద్ధకి ఉదాహరణగా నిలుస్తుంది. 'పగటి దివిటీల తోట', 'నెలవంక నేస్తం', 'వానగామి',' వెలుతురు శ్వాస', 'మూడంకె మోహం'.. కవితల శీర్షికలు చూస్తుంటేనే మంచి కవితలు చదవబోతున్నామన్న అనుభూతి కలుగుతుంది. సాధారణంగా కవితా సంకలనాల్లో కనిపించే 'మొదటి మాట','పరిచయ వాక్యాలు', 'ఆశీస్సులు' లాంటివి లేకపోవడమూ ఈ సంకలనం ప్రత్యేకతే.

అచ్చమైన తెలుగు కవితల్లో వెన్నెల స్వప్నాలని, బాధాశ్రుకణాలని, చెట్ల గాలి భాషని, పసిపెయ్యల ఆనవాళ్ళని.. మరీమరీ చూడాలనుకుంటే తప్పని సరిగా ఈ కవితా సంపుటిని చదవండి. రచయిత్రి కవితా వైచిత్రిని మెచ్చుకుని తీరుతారు...!

***




**చిన్నప్పుడే** వదిలేసిన మీ వూరి చెరువుగట్టుమీది నిద్రగన్నేరు చెట్టు గుర్తుందా? వర్షం వెలిశాక బురదలో వసంతోత్సవం చేసుకుంటుంటే నాన్న కేకలకి ఇల్లు చేరిన సంగతులు జ్ఞాపకాల్లో తరుముతున్నాయా? అర్థ రాత్రి ఆరుబయట నిద్రపోతుంటే హఠాత్తుగా కురిసిన వర్షానికి వరండాలో చేరిన నులకమంచం మళ్ళీ పలకరించినట్లుందా? శత్రువుని కూడా ప్రేమిస్తుంటామనే విషయం మరోసారి మననం చేసుకుంటే బావుంటుందేమో కదూ!? దుమ్మురేగిన సాయంత్రం ఇంటికి చేరేప్పటి దృశ్యాలు ఆలోచనల్లో ఎలా నిక్షిప్తమయ్యాయో ఆగి చూసుకుంటే ఎంత నొస్టాల్జియా!..- ఇవన్నీ తలుచుకుని పలవరించగల సున్నితత్వం మీదైతే చంద్ర వ్రాసిన ఈ కవితలన్నీ మీ కోసమే! ఈ కవితలు అర్థం చేసుకోవడానికి నిఘంటువులు అవసరం లేదు, మనసుభాషలోకి అనువాదం చేసుకోడానికి దుబాసీలతో పనిలేదు. జీవనదృశ్యాల మృదు సంగీతం వినగలిగే భావుకత ఉంటే చంద్రగారి కవితలు మీ హృదయాంగణాల్లో పాలపిట్టల్లా వాలి మిమ్మల్ని మరో లోకంలోకి తీసుకెళతాయి. చెరువు పక్కన నిలుచున్న చెట్టు 'బాటంట తీసుకుపోయే మరెన్ని పాడెలపై / ఆకుల కన్నీళ్ళు రాల్చిందో' అనుకున్నప్పుడు, 'గాడిదలా ఈడ్చి తన్ననీ / ఆడపిల్లలా ముద్దు పెట్టుకోనీ..' అమూల్యమైన ఈ జీవితాన్ని ఎప్పుడూ ఇష్టపడతామనే సత్యాన్ని గుర్తుచేసుకున్నప్పుడు, 'ఏ మలుపులోనో ఓ మెరుపుతీగ అరక్షణపు తళుకుచూపు పారేస్తే / పుచ్చుకుని, అపురూపంగా దాచుకుని మురుసుకునే' సాయంకాలాలు మనసుమీద ముద్రించుకున్నప్పుడు చంద్ర కవిగా పూర్తి విజయం సాధిస్తారు. అమెరికా ప్రవాసాంధ్ర కవుల్లో ఒక స్థాయి గల కవితలు వ్రాసే కవుల గురించి చెప్పుకోవాలంటే చంద్ర మొదటి వరుసలో నిలుస్తారు. పల్లెటూరి జ్ఞాపకాలు ఎంతగా తనని తరుముతున్నాయో, వర్తమాన జీవిత వాస్తవాలు కూడా అంతే తీవ్రంగా ఆ ఆలోచనలని ప్రభావితంచేస్తున్నాయి. అందుకే దేనికదే చిక్కగా అనిపించే ఈ కవితలన్నీ కవితా ప్రియులనే కాదు, ఏకొంచెం ఆలోచింపచేసే మనసునైనా ఆకర్షించడమే కాదు..మళ్ళీ మళ్ళీ చదవాలని అనిపిస్తాయి.

***

***Author :***

***Chandra Kanneganti***
***5318, Cambridge Ct.,***
***Grapevine, TX 76051***




**'కొత్తపాళీ'** పేరుతో బ్లాగులోకంలో సుపరిచితులైన ఎస్.నారాయణ స్వామి గారి కథల సంపుటి ఈ 'రంగుటద్దాల కిటికీ'. అమెరికా ప్రవాసాంధ్ర రచయితల్లో సొంత గొంతుక ఉన్న కథా రచయిత నారాయణ స్వామి గారు. ఇరవయ్యొక్క కథలున్న ఈ సంపుటిలో అధికశాతం కథలు అమెరికా తెలుగువారి జీవితాలని ప్రతిబింబించేవే. రచయిత ఒకటి రెండు పేజీల గల్పికలనుంచీ 10-15 పేజీల పెద్ద కథల వరకూ దేన్నైనా నేర్పుగా పాఠకులను ఆసాంతం చదివించేలా వ్రాయగలరని నిరూపించుకున్నారు. కథలన్నీ దేనికదే వైవిధ్యంతో కూడుకుని ఉన్నవే. ఒకదాని నీడ మరోదాని మీద పడదు. 'తుపాకి','ఇండియన్ వాల్యూస్', 'చక్కని చుక్క' మొదలైన కథల్లో కథా వస్తువుని వివరంగా ఎంత ప్రతిభావంతంగా చెప్పారో, 'వీరిగాడి వలస', ' పూర్వ జన్మ వాసన',' ఓరి భగవంతుడా ఇప్పుడేం దారి?' కథల్లో వస్తువు కంటే కథనానికి పెద్ద పీట వేసిన తీరు బావుంది. పాఠకుల మనసులకి హత్తుకునేలా, అలోచింపచేసేలా ముగించిన ఈ కథల్లోని శిల్పం రచయితని చాలాకాలం గుర్తుంచుకునేలా చేస్తుంది. 'ఆదా','వలయం','కూపస్థమండూకం' లాంటి చిన్న గల్పికల్లాంటి కథల్లో కూడ కొసమెరుపులు బావున్నాయి. రచయిత తీసుకున్న వస్తు వైవిధ్యాన్ని, కొన్ని కథల్లోని రచనా శైలిని తప్పకుండా అభినందించి తీరాలి. రంగుటద్దాల కిటికీలోంచి బయటికి చూస్తే కనిపించే ప్రకృతి వర్ణాలన్నీ ఈ కథల్లో ప్రతిఫలిస్తుంటాయి. కథా ప్రియులు తప్పక చదవాల్సిన కథా సంపుటి ఇది.

***

**Published by:**

**S.NARAYANASWAMY**
**kottapali@gmail.com**

**To buy this book, please visit Author's Blog**

**http://kottapali.blogspot.com**




**_Published by:_**

**_Flat# G-1, Sai Ratna Towers_**
**_8-3-229/W/38, Hailam Colony, Venkatagiri_**
**_Hyderabad – 500 045_**
**_wvharagopal@yahoo.co.in_**
**_Phone: 91-40-2354 8774_**

**'మానస'** కలంపేరుతో పాతిక, ముప్పై ఏళ్ళ క్రిందట కథలు వ్రాసిన ఉన్నవ వెంకట హరగోపాల్ గారు, ఈ కాలం పాఠకులకి అంతగా తెలియకపోవచ్చు. ఇందులో ఆశ్చర్యమేమీ లేదు. ఎందుకంటే ఆయన 1970–1984 మధ్యలో మాత్రమే కథలు వ్రాశారు. ఆయన వ్రాసిన ఒక్కో కథా ఒక్కో మరపురాని రచనా శిల్పం. అంత అద్భుతమైన కథలు వ్రాసిన 'మానస'గారు 27 ఏళ్ళుగా వ్రాయకపోవడం ఆశ్చర్యమే! ఈ సంపుటిలోని కథలన్నీ ఆ రోజుల్లో ప్రముఖ పత్రికల్లో వచ్చినవే. తెలుగు పత్రికలకి స్వర్ణయుగం అనదగిన ఆరోజుల్లో 'మానస' గారి కథ కనిపించని పత్రిక ఉండేది కాదు. ఈ కథలన్నింటిలోనూ సున్నితమైన మానవ సంబంధాల చిత్రీకరణ అంతస్సూత్రంగా సాగుతుంది. నేపథ్యం ఏదైనా ప్రతి కథలోనూ ఉదాత్తతకే పెద్దపీట వేశారు కనుకనే ఇప్పటికీ కొత్తగా కనిపిస్తాయి. ముఖ్యంగా సమకాలీన సంఘటనల మీద ఆధారపడడం కంటే మనుషులు, మనస్తత్వాలు.. వీటిమీద ఆధారపడిన కథలు కావడం వల్ల నిత్యనూతనత్వాన్ని సంతరించుకున్నాయీ కథలు. ప్రతి కథా చివరివరకూ చదివి తీరాలి.. ఎందుకంటే చివరి పేరాలోనో, చివరి వాక్యంలోనో మనసును కట్టిపడేసే ఒక మరపురాని మలుపు ఉంటుంది. 'ఈ పెళ్ళి వద్దమ్మా', 'ఎక్స్‌ప్రెస్ ఆగదు'.. చదువుతుంటే ఈ కథలు ఆత్రేయ చదివి వుంటే ఖచ్చితంగా వెంటనే ఆయా సన్నివేశాలకి పాటలు వ్రాసేసి ఉండేవారేమో అనిపిస్తుంది. 'ప్రేమ'లో కొత్తకోణాలని చూపించిన సన్నివేశాలు, కథా గమనాలు అంత కదిలించేవిలా ఉన్నాయి. సూటిగా, కుప్తంగా ఉన్న వాక్యాలు, చాలా వరకూ సంభాషణా రూపంలో సాగే సన్నివేశాలు..చదువుతుంటే దృశ్యాలు కళ్ళముందు నిలుస్తాయి. 39 కథలతో పాటు చివరలో 'మానస' గారు వ్రాసిన ఒక నవలికని కూడా ఈ సంపుటిలో చేర్చారు. దాని పేరు 'నవ్వినా కన్నీళ్ళే'. దీన్ని ఇంకో విధంగా చెబితే తెలుగు సినిమా అభిమానులంతా ఈయన్ని వెంటనే గుర్తుపట్టగలరు. తెలుగు సినిమా చరిత్రలో మైలురాయిగా నిలిచిపోయిన 'సీతారామయ్య గారి మనవరాలు' సినిమా మాతృక ఈ నవల..! 'మానస'గారు మధ్యలో మానకుండా రచనా వ్యాసంగాన్ని కొనసాగించిఉంటే ఇప్పటికీ కథారచయితల క్రమంలో మొదటి వరుసలోనే ఉండేవారు. తెలుగకథాభిమానులకి ఈ కథలు విందు భోజనం లాంటివి..! . ***




*For Copies*
***TRT 199/50, Sirsilk Colony***
***Sirpur Kagaz Nagar – 504 296***

***Phone : 91-08738-238659***

**'మధూలస'** కలంపేరుతో కవితలూ, గేయాలు వ్రాసే తుమ్మూరి రామ్‌మోహన్ రావు గారు వ్రాసిన త్రిపదల (ముందు మాత వ్రాసిన అద్దేపల్లి రామ్మోహనరావు గారు హైకూలు అనికూడా పేర్కొన్నారు) సంపుటి ఈ పుస్తకం. మూడంటే మూడు పాదాల్లో చక్కటి భావాన్నీ, పోలికనీ, ఆలోచననీ ప్రతిభావంతంగా పొదిగారు రచయిత. ఒక్కో త్రిపద చదవగానే 'ఎంత చక్కటి పోలిక' అనో 'ఎంత చక్కటి అన్వయం' అనో అనిపిస్తుంది. కవితల నిడివి ఎక్కువైతే చెప్పదలచుకున్న విషయాన్ని విశదంగా తెలియచేయడానికి కవికి స్వేచ్ఛ ఉంటుంది. కానీ మూడే పాదాల్లో అంత గాఢతని తీసుకురావడం ఒక విధంగా కవికి పరిక్షా సమయమే. ఈ ప్రక్రియలో రచయిత నూటికి నూరు శాతం విజయం సాధించారు.

'చంద్రుణ్ణి / కటకటాల వెనక్కి తోసింది / కొబ్బరాకు' ఐదు పదాలు..మూడు పాదాలు..చక్కటి దృశ్యాన్ని ఆవిష్కరిస్తాయి, ఆలోచనని అలంకరించి కళ్ళముందు నిలబెడతాయి. ప్రకృతి దృశ్యాలకి సరికొత్త అన్వయాలు కొన్నింటిలోనూ, సామాజిక సమస్యల చిత్రణ కొన్నింటిలోనూ, వేర్వేరు అర్థాలతో మళ్ళీ చదివించేవి ఇంకొన్నీ..మొత్తం మీద ప్రతి త్రిపదా చక్కటి కవిత్వాన్ని చదివిన తృప్తిని మిగులుస్తుంది. 'నాగలి / వేచి చూస్తున్నది / మ్యూజియం పిలుపుకై' ఇది చాలు యంత్రీకరణ వల్ల సంప్రదాయంగా వస్తున్న వ్యవసాయ పనిముట్ల దీన స్థితినిచెప్పడానికి. 'సూర్యచంద్రులు / ఆకాశం నుంచి దిగివచ్చి ' రైల్వే గ్యాంగ్ మెన్ లై' రాత్రీ పగలూ శ్రమించే రైల్వే గ్యాంగ్‌మెన్‌ల గురించి ఇంత కవితాత్మకంగా వ్రాయడం రామ్మోహన్ రావు గారికే చేతనైంది. 'పలక మీద / పిచ్చి గీతలు గీసింది పాప / అద్భుత చిత్రాల్ని చూశాయి అమ్మ కళ్ళు'! అదీ తల్లిప్రేమలోని ప్రత్యేకత!! ఈ త్రిపదల సౌరభాల్ని ఆస్వాదించిన వెరెవరైనా చక్కటి ప్రయత్నాన్ని విజయవంతంగా నిర్వహించిన రామ్మోహన్ రావు గారిని అభినందించకుండా ఉండలేరు.

***




***Vinjamuri Ragasudha***
***Flat# 13, Guinevere Court***
***Lancelot Road***
***Wembley HAO 2FH, UK***

‘**కౌముది**‘ పాఠకులకి కవయిత్రి రాగసుధ గారు చిరపరిచితులే. లండన్‌లో పర్యాటక శాఖ నిర్వహణా అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. పేరొందిన శాస్త్రీయ నృత్యకళాకారిణి కూడా ఐన రాగసుధ గారు లండన్‌లో జరిగే తెలుగు సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకైన పాత్ర వహిస్తుంటారు. రాగసుధగారి కలం నుంచీ వెలువడిన కవితల సంపుటి ఈ ‘కవితా రగసుధ‘. ప్రముఖ చిత్రకారుడు బాపుగారి ముఖచిత్రం తోనూ, చంద్రగారి రేఖాచిత్రాలతోనూ అందంగా రూపుదిద్దుకుంది ఈ కవితా సంపుటి. చాలా కవితలు చక్కటి, చిక్కటి ప్రబంధ గ్రాంధిక భాషలో సాగుతాయి. వచనకవితా ప్రవాహంలో అందరూ కొట్టుకుపోతున్న ఈ రోజుల్లో సుగంధపరిమళ భరితమైన పదాలతో కవితలని కూర్చిన రాగసుధ గారిని అభినందించి తీరాలి. పదాల పొందికకి చక్కటి ఆలోచనలు కూడా తోడవడం ప్రశంసనీయం. ‘అలకల అల్లరులకే అలజడి చెందే అంగనకు / అంగాంగమున అంతరంగమున అంపశయ్య అందచేసిన / అంగజునికి అభివాదము ..‘ నడకలో కొన్నీ , ‘సృష్టి నేర్పని రాగమది / భాషకందని భావమది..‘ నడకలో కొన్నీ అలవోకగా సాగుతాయా కవితలు. కొన్ని కొన్ని కవితల ముగింపు ఏదో ప్రకటన చేసినట్లనిపిస్తుంది. ఇలా స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు కాక, కవితాత్మక ముగింపులు ఇచ్చి ఉంటే చదువరుల మనసుల్లో ముద్రించుకు పోయే అవకాశం ఎక్కువగా ఉండేది. ఇది చిన్న సలహానే తప్ప లోటు మాత్రం కాదు. మొత్తం మీద ‘వెన్నెల వానలో తడిసి మెరిసే / అరవిరిసిన నవ మల్లిక ‘ల లాంటి చాలా కవితలు కవితా ప్రియులని అలరిస్తాయనడంలో సందేహం లేదు.

. ***




**కెనడాలో** స్థిరపడిన తెలుగు రచయితల కథా సంకలనం ఈ ‘పడమటి కనుమల్లో తరుణోదయం‘. చక్కటి ప్రయత్నం, అందమైన ముద్రణ, వైవిధ్య భరితమైన కథాంశాలు..అన్నీ కలిసి ఈ పుస్తకాన్ని ఆసాంతం చదివిస్తాయి. ముందు మాటలో డా. కె.కె. గారు చెప్పినట్లు "ప్రవాసాంధ్రులు అంటే కేవలం అమెరికా తెలుగు వాళ్ళు మాత్రమే అన్న అపప్రథను కెనడీయులైన ఈ తెలుగు రచయితలు చెరిపివేశారు. తెలుగు భాష పట్ల సంస్కృతి పట్ల నిక్కమైన నెనరును(ప్రేమ) చూపించిన వీరిని, వీరి కథలను సాదరంగా తెలుగు కథల ప్రపంచంలోకి ఆహ్వానిద్దాం‘. కొమరవోలు సరోజ, శేషు అప్పారావు, మంగళకందూర్, సోమయాజుల సోదరులు, నెల్లుట్ల నవీనచంద్ర లు వ్రాసిన 25 కథల సంకలనం ఈ పుస్తకం. ప్రతి విభాగం మొదట్లోనూ ఆయా రచయితల రచనా శైలిని సంక్షిప్తంగా పరిచయం చేయడం బావుంది. ఐదుగురు రచయితలదీ ఐదు రకాల రచనా శైలి. ఒక విభాగంలో అంతరంగ సంఘర్షణలుంటే, మరో విభాగంలో చమత్కారాలు, ఇంకో విభాగంలో సరసమైన ప్రేమ కథలు..ఇలా సాగుతూ ప్రతి కథా ఆసక్తికరంగా చదివిస్తుంది. కెనడా జీవనవిధానాల నేపథ్యాలతో బాటు, మాతృదేశంలోని పాత్రలతో, సంఘటనలతోనూ కథలు సాగడం అభినందనీయం. కెనడా ప్రవాసాంధ్ర రచయితలనుంచీ ఇలాంటి సంకలనాలు మరిన్ని రావాలని మనసారా ఆశిద్దాం.

***

**_Honey Publications_**
**_9885451014_**




**_Published by:_**

**_Dr.Mamgamamba_**
**_11-17, Indira Nagar, Kottapeta_**
**_Hyderabad – 500 035_**
**_mamgamamba@yahoo.co.in_**
**_Phone: 91-40-2404 2520_**

**తెలుగుసాహిత్యంలో పద్యానికి కున్న ప్రాముఖ్యత గురించి వేరే చెప్పాల్సిన** అవసరం లేదు. ప్రాచీన కావ్యాలన్నీ పద్య రూపాలే. క్రిందటి తరం వరకూ కూడా విద్యార్థి దశలో అందరూ పద్యాలు నేర్చుకున్నవారే. నీతిశతకాల పద్యాల్లో ఇప్పుడు కార్పొరేట్లలో బోధిస్తున్న వ్యక్తిత్వ వికాస పాఠాలన్నీ ఉన్నాయి. ప్రాచీన కావ్యాల పద్యాల్లో తెలుగు భాష సొగసులన్నీ నిక్షిప్తమై ఉన్నాయి. పద్యాన్ని మరిచిపోతే తెలుగు భాషలోని విలువైన సంపదని మరిచిపోయినట్లే. కంప్యూటర్ యుగంలో కొట్టుకుపోతున్న తరం కూడా ఈ పద్యాల సౌరభాలని ఆస్వాదించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో డా.మంగమాంబ గారు కూర్చిన ఈ పద్యతోరణాల గ్రంథం ఎంతో విలువైనది. డా.మంగమాంబగారు రసాయనశాస్త్రంలో ఎమ్.ఎస్.సి పి.హెచ్.డి చేసినా చిన్నప్పుడు నేర్చుకున్న తెలుగు పద్యాని మరిచిపోలేదు. అందుకే ఉద్యోగవిరమణ తర్వాత చేపట్టిన ఈ పుస్తక సంకలనం 'పిల్లలకి బాగా ఉపయోగపడాలని' అన్నారు కానీ, కేవలం పిల్లలకే కాదు పెద్దలకి కూడ ఎంతో ఉపయోగకారి. దీని ప్రత్యేకత ఏమిటంటే పద్యాలన్నీ అకారాది క్రమంలో పొందుపరచబడ్డాయి. మొత్తం 20 పైగా మూలగ్రంథాలనుంచీ సేకరించి శ్రమకోర్చి వాటిని ఒక వరుసలో అమర్చారు. భారత, భాగవతాల నుంచేకాక అన్ని నీతిశతకాల నుంచీ, జాషువా గారి ఆధునిక ఖండకావ్యాల నుంచీ కూడా సేకరించిన పద్యాల తోరణాలివి. అన్ని కావ్యాలని సవివరంగా చదివే తీరిక లేని వాళ్ళకే కాక శీఘ్రంగా ఏదైనా పద్య పాఠం పూర్తిగా తెలుసుకోవాలనుకునే వారికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందీ పుస్తకం. ఉదా. 'చ' అనుకోగానే వేమన శతకంలోని 'చిత్తశుద్ధి కలిగి..' అన్న పద్యమూ, భాగవతం నుంచీ 'చేతులారంగ..' అన్న పద్యమూ, నార్ల గారు వ్రాసిన 'చరిత యనగ కాదు..' అన్న పద్యమూ ఇలా అన్నీ వరుసగా పలకరించి మనసు పులకరింపచేస్తాయి. తెలుగులో ఇలాంటి కూర్పు వేరే ఎవ్వరూ చేసిన దాఖలాలు లేవు. రచయిత్రి (కూర్పరి) గారిని అభినందించి తీరాలి. పుస్తకం చివరలో వారు వ్రాసిన 'పద్యం నా అంతరంగ నేస్తం' అన్న వివరణ కూడా చాలా ఆసక్తికరంగా ఉంది. ప్రతి తెలుగింటా ఉండాల్సిన మంచి సంకలనం ఇది. . ***




*Vanguri Foundation of America Inc.*
*PO Box 1948,*
*Stafford, TX 77497, USA*
*rvanguri@wt.net*
*Phone(US): 281-277-0445*

**వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా** వారు ప్రచురించిన 38వ పుస్తకం ఇది. ఇదొక విలక్షణమైన ఆసక్తిదాయకమైన పుస్తకం. ప్రముఖ పాత్రికేయుడు, కవి, రచయిత, ప్రయోక్త ఐన ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ గారు వ్యక్తిగతంగానూ, వృత్తి రీత్యానూ తనకి పరిచయమైన, మిత్రులైన అనేకమంది ప్రముఖ వ్యక్తుల గురించి వ్రాసిన విశేషాల సంకలనం ఈ పుస్తకం. పెద్దలతో పరిచయాలు అనగానే చాలా మంది 'ఎక్కడ కలుసుకున్నాం, ఎలా కలుసుకున్నాం, ఎన్ని కబుర్లు మాట్లాడుకున్నాం, ఆ ప్రముఖుడికి నేనంటే ఎంత ప్రేమా..' ఇలా వ్రాస్తుంటారు. కానీ శ్రీకాంత్ శర్మగారు ఈ పుస్తకంలో వ్యక్తిగత విషయాలని తక్కువగానూ, ఆయా ప్రముఖల వ్యక్తిత్వ విశ్లేషణలని తనదైన కోణంలోనూ చక్కగా వివరించారు. అలాగని పూర్తిగా మూడో వ్యక్తి వ్రాసిన వ్యాసాల్లానూ ఉండవు. పరిచయాలనీ, విశ్లేషణలనీ సమతూకంలో రంగరించి విలువైన వ్యాస సంపుటిగా ఈ పుస్తకాన్ని తయారు చేశారు. ముందు మాటలో వ్రాసుకున్నారు " నా కర్థమైన వారి వారి సారస్వత, కళా వ్యక్తిత్వాలను నా వ్యక్తిగత అనుభవాలతో కలిపి చూసి , మీకు చెప్పే ప్రయత్నం చేశాను..' అని. ఈ వాక్యాలు నూటికి నూరు శాతం నిజం. తెలుగు సాహిత్యాభిమానులంతా తప్పక చదవాల్సిన పుస్తకం. అమెరికాలో ఉంటూ కూడా విశిష్టమైన సేవ చేస్తున్న వంగూరి ఫౌండేషన్ వారిని కూడా, ఇంత మంచి పుస్తకాన్ని అందంగా ప్రచురించి తెలుగు వారికి అందించినందుకు అభినందించి తీరాలి.

***